# Enduring Characters from Ramayan - Hanuman

ఎత్తిందో వానర జన్మ, మరి దానికి తోడు తండ్రి క్షణం నిలకడ లేని వాయుదేవుడు. చంచల స్వభావం హనుమంతుడి జాతి లక్షణంగా వారసత్వంగా లబించిన ఏకైక సంపద. కానీ ఈయన మహావీరుడు, భాగవతోత్తములందరికీ ఉత్తముడు, మంత్రులందరికీ మణిదీపం, వేదాలు, వ్యాకరణాది శాస్త్రములలో పండితుడు, నాదోపాసన చేసిన సంగీత విద్వాంసుడు, అన్నిటినీ మించి మానస వనచరవర సంచారము నిలిపి, సరుగున పాదములకు స్వాంతమను సరోజమును సమర్పణము చేసుకున్న మహా తపస్వి. చంచలమైన ఈ వానరుడు ఇంత ఎత్తుకు ఎలా ఎదిగి పోయాడు? ఈయన రహస్యము తప్పకుండా తెలుసుకోవలసిందే.

హనుమంతుడు త్రిమూర్తులలాగ స్వయంభువు కాదు, దేవతలలోనో, దిక్పాలకులలోనో ఒకడు కాదు - కిష్కింధ ఇప్పుడు కర్ణాటక రాష్ట్రంలో వుంది కాబట్టి - హనుమంతుడు నిజంగా మన పక్కింటివాడే. ఈయన తండ్రి కేసరి అనే వానర ప్రముఖుడు. తల్లి అంజనాదేవి మంచి అందగత్తె. ఒకనాడు ఆవిడ చల్లగాలిలో పర్వత సానువుల్లో విహరిస్తుండగా వాయుదేవుడికి ఈవిడ అందం చూసి దిమ్మ తిరిగిపోయిందట. వాయువు ఆవిడ సర్వాంగాలలోకి దూరి అంజనాదేవిని ఆలింగనం చేసుకున్నాడట. అందువల్ల ఆవిడకి హనుమంతుడు జన్మించేడు. అంజనకి పుట్టినవాడు కాబట్టి ఆంజనేయుడంటారు. మన తెలుగువాళ్ళకి ఇతను బాగా కావలిసినవాడూ, దగ్గరివాడూను. అందుచేత తెలుగువాళ్ళు ఇతనిని ముద్దుగా అంజయ్య, అంజిగాడు అని పిలుచుకుంటారు. "మన పక్కింటి కుర్రాడే ఎంత ఎత్తుకు ఎదిగిపోయాడు" అని ముక్కు మీద వేలేసుకుంటాం గానీ, ఉత్తరాదివాళ్ళు ఇతనిని గౌరవంగా "హనుమాన్ జీ" అని భక్తి ప్రపత్తులతో పూజించుకుంటారు. వారణాశిలోనైతే ఏకంగా "సంకట్ మోచన్" అనే పెద్దగుడి కూడా ఉంది హనుమంతునికి.

సంకట్ మోచన్ అంటే కష్టాలు తీర్చేవాడని అర్ధము. నిజంగానే హనుమంతుడు అందరి కష్టాలు తీరుస్తాడు, అందరికీ సేవ చేస్తాడు. ఈయనకోసం వేల సంవత్సరాలు శరీరం ఎండగొట్టుకుని తపస్సు చెయ్యనక్కరలేదు. ఎలుగెత్తి పిలుస్తే చాలు, గట్టిగా పూనికగా రామభజన చేస్తే చాలు, పరిగెత్తుకుంటూ వచ్చేస్తాడు. "బాబ్బాబు, ఈ కష్టాలు పడలేకపోతున్నాను, నువ్వే ఆ శ్రీరామసన్నిధికి పోయి ఈ కష్టాలు తీరిపోయే మార్గం ఏదైనా కనుక్కుని రా నాయనా" అంటూ

బతిమాలితే చాలు- "దానికేమి బాబాయ్ ఇదిగో చిటికెలో వస్తాను" అంటూ ఆఘమేఘాలమీద పోయి పని సాధించుకొని వచ్చేస్తాడు. దేనికీ ప్రతిఫలం ఆశించడు. పనైపోయిన తర్వాత ఎక్కడైనా రామభజన అవుతూ ఉంటే అందరికన్నా ముందు అక్కడకి చేరుతాడు - భజన అయ్యేంతవరకు అక్కడే ఉంటాడు. లేకపోతే ఏ చెట్టు మీదకో ఎక్కి కూర్చుంటాడు. ఇదీ ఈయన తరహా. తనకంటూ ఏ పనీ లేదు, తన గురించిన ఆలోచన లేదు, కోరిక లేదు - ఇది హనుమంతుని మొదటి కిటుకు. మహాభారతంలో భీముడికి యుగలక్షణాల గురించి చెప్తూ కృతయుగంలో "కృతమేగాని కర్తవ్యం లేదంటాడు హనుమంతుడు. అంటే చెయ్యబడేదేగాని చెయ్యవలసినది అంటూ ఏదీ లేదన్నమాట. ఇది హనుమంతుడికి బాగా వర్తిస్తుంది. స్వార్థమూ కర్తవ్యమూ లేనివాడికి తనకంటూ ఆలోచనలేవీ ఉండవు కదా! అందుచేత ఈయన చీకు చింతా లేకుండా ఉంటాడన్నమాట.

చిన్నపటినుంచీ ఆంజనేయుడు మంచి చురుకైనవాడే. చాలా చిన్న వయసులో, ఒకరోజు బాగా ఆకలేసి, ఉదయిస్తున్న సూర్యుడిని చూసి - ఏదో పండనుకొని, పట్టుకు తినేద్దాం అనుకున్నాడు. వాయుపుత్రుడు కదా - ఎగరడంలో అసాధ్యుడు, అంతరిక్షం లోకి రివ్వున ఎగిరిపోయాడు. అది చూసి దేవేంద్రుడికి కోపం వచ్చింది - వజ్రాయుధంతో ఆంజనేయుడిని కొట్టేడు. ఆ దెబ్బకి ఆంజనేయుడు కింద పడిపోయాడు - చెక్కిలి విరిగిపోయింది. చెక్కిలిని సంస్కృతంలో హనువు అంటారు. హనువు పగిలింది కనుక హనుమంతుడంటారు. ఆంజనేయుడిలా పడిపోవటం చూసి వాయుదేవుడికి బాగా కోపం వచ్చింది - ఆయన స్తంభించిపోయాడు - వాయువు లేక చరాచరజగత్తు అల్లాడిపోయింది. అపుడు దేవతలందరూ వాయుదేవుడిని ప్రసన్నం చేసుకోవటానికి ఆంజనేయుడికి వరాలిచ్చేరు, బ్రహ్మదేవుడు ఏ ఆయుధముతోనూ చావు లేకుండానూ, దేవేంద్రుడు స్వచ్ఛంద మరణాన్నీ వరాలుగా ఇచ్చేరు. ఇలా దేవతలందరి వరాలతో హనుమంతుడు మహావీరుడూ, పరాక్రమవంతుడూ అయాడు. అందుకేనేమో - ధైర్యే సాహసే లక్ష్మీ అంటారు. భయంలేని వాడికి, ఉత్సాహవంతుడికీ వరాలు వాటంతటవే వెతుక్కుంటూ వస్తాయి.

విద్యాభ్యాసం చెయ్యడానికి ఆంజనేయుడు ఏ గురుకులానికో పోయి ఉపదేష్టలదగ్గర తీరిగ్గా కూర్చుని వేదాలు వల్లించలేదు. సకలవిద్యలూ జగత్సాక్షి సూర్యభగవానుడి దగ్గర

నేర్చుకున్నాడట. తనకి విద్య నేర్పమని సూర్యుడిని అడిగితే, దానికి సూర్యుడు - "నాయనా, నీకు విద్య నేర్పడానికి నాకు తీరికెక్కడిది? రోజంతా ఉదయాద్రి నుంచీ అస్తాద్రి దాకా పరుగులు పెట్టాలి కదా!" అన్నాడట. దానికి హనుమంతుడు - "స్వామీ! నేను కూడా మీతోపాటు ప్రయాణం చేస్తూనే నేర్చుకుంటా" అన్నాడు. కానీ ఇందులో ఒక చిన్న కిటుకుంది - శిష్యుడు విద్యలన్నీ గురుముఖతా నేర్చుకోవాలికదా! అందుకని సూర్యుడు - "నా రథం ముందు నాకన్నా కొంచెం వేగంగా పరిగెడుతూ నేర్చుకోగలిగితే, నేర్పడానికి నాకేం అభ్యంతరం లే" దన్నాడుట. హనుమంతుడు అలా సూరుడి రథం ముందు నిల్చుని, వెనక్కు పరిగెడుతూ సూర్యుడి దగ్గర వేదవ్యాకరణాది శాస్త్రాలన్నీ నేర్చుకున్నాడు. సూర్యుడికి వేదపారాయణుడని బిరుదుంది కదా! అదీకాక ఆయన సర్వసాక్షి - అన్నీ చూస్తాడు కాబట్టి ఆయనకి తెలియని సంగతంటూ ఉండదు.

హనుమంతుడూ, నలుడూ, నీలుడూ, సుషేణుడూ, సుగ్రీవుడికి మంత్రులు, ఆయనకి ఆప్త మిత్రులు. వాలి సుగ్రీవుడిని కిష్కింధ నుంచి వెళ్ళగొట్టినప్పుడు, ఈ నలుగురూ కూడ ఆయనతోపాటే కిష్కింధను విడచిపెట్టి సుగ్రీవుడితోనే వుండి, ఆయనని కనిపెట్టుకొని కాపాడుతూ వుండేవారు. రామాయణంలో ఈ నలుగురు వానర ప్రముఖులు చాల ముఖ్య పాత్రలను పోషించారు. నీలుడు అగ్నిహోత్రుని పుత్రుడు, స్వయంగా అగ్నిహోత్రుని వంటి వాడు. వానరసేనంతటికీ ప్రధాన సేనాపతి. నలుడు విశ్వకర్మ కుమారుడు - సముద్రం మీద సేతువును నిర్మించింది ఇతడే. సుషేణుడు సుగ్రీవుడి మామగారు, పైగా మంచి వైద్యుడు. లక్ష్మణుడు ప్రాణాపాయస్థితిలో వున్నప్పుడు హనుమంతుడిని సంజీవిని కోసం పంపించినదీ సుషేణుడే. ఇంక హనుమంతుని సంగతి సరేసరి - ఈయన లేని రామాయణంలో ముక్తీ లేదు, రామకధలో రక్తీ లేదు.

రామాయణంలో ఎన్నో మధురమైన ఘట్టాఆలూ సన్నివేశాలూ ఉన్నాయి. విశ్వామిత్రుడి రాక, కౌశికుడి యాగ సంరక్షణ, అహల్యా శాపవిమోచనం, సీతారామ కళ్యాణం, శబరి నైవేద్యం - ఇలా ఎన్నెన్నో మనోహరమైన సన్నివేశాలతో రామాయణాన్ని నింపేరు మహాకవి వాల్మీకి. వాటన్నిటిలోకి రామాయణంలో హనుమంతుని ప్రవేశం, రామాంజనేయుల కలయిక మధురాతిమధురమైన ఘట్టం.

హనుమంతుడి ప్రవేశం ముందు రామాయణం అంతా చాలా బరువుగా వుంటుంది. దశరధుడికి చాలా కాలం వరకూ పిల్లలు పుట్టకపోవడం, ఆయనకి గురువులు, మంత్రుల ఉపదేశాలూ, తాటక సంహారం, శివధనుర్భంగం, రామ పట్టాభిషేకం ఆగిపోవడం, రాముడి వనవాసం, పాదుకా పట్టాభిషేకం, జనస్థానంలో ఖరదూషణుల సంహారం, సీతాపహరణం - ఇలా అన్నీ గంభీరమైన ఘట్టాలే. అంతవరకూ, రాముడికందరూ పెద్దలూ, గురువులూ, మంత్రులు, ప్రజలు, సేవకులు, భృత్యులూ, ఋషులూ - ఇలా అందరూ అతడితో ఏదో పనున్నవాళ్ళు, ఆదేశించినవాళ్ళు, సేవించినవాళ్ళే గాని, రాముడికి మిత్రులు లేరు. గుహుడు ఒక్క మెరపు మెరసి మాయమౌతాడు. గుహుడు, రాముడూ మిత్రులేకాని వారి మద్య చక్రవర్తి సామంతుల సంబంధం కూడ వున్నది. అందువల్ల మనకి గుహుడు సేవకుడిలాగే కనిపిస్తాడు.

అరణ్యకాండ వరకూ రామకధ మిత్రులులేని జీవితంలా బరువుగానే సాగుతుంది. హనుమంతుడి రాకతో కధలో కొత్త చైతన్యమూ, కధానాయకుడిలో కొత్త ఉత్సాహమూ కనిపిస్తాయి. వాల్మీకి కూడ కిష్కింధనుంచి కధను మంచి ఉత్సాహంతో ముందుకి నడిపిస్తారు. హనుమంతుడితో వచ్చిన చిక్కే ఇది - ఈయన పరిచయం ఒకసారి అయితే మరి వదలబుద్ధి కాదు. హనుమంతుడంత ప్రేమపాత్రుడు. వాల్మీకిగారికి కూడ హనుమంతుడంటే వల్లమాలిన అభిమానం. ఒక కాండ మొత్తానికి హనుమంతుడిని నాయకుడిని చేసాడాయన. ఇంక రాముడి సంగతి చెప్పే అక్కరలేదు. సీతను వెదకి రావణ సంహారం చెయ్యాలి కాబట్టి యుద్ధ కాండ వరకూ నడిచేడు గాని, లేకపోతే కిష్కింధ లోనే తిష్ట వేసుకుని కూచునేవాడేమో! రాముడికి తప్పలేదు గాని, రామకధని చదివేవారు మాత్రం జనకుడు సీతని రాముడికి కన్యాదానం చేసే సన్నివేశం దగ్గరా, రామాంజనేయులు కలసిన ఘట్టం దగ్గరా చాలా సేపు ఆగిపోతారు. ఎంత ప్రయత్నించినా ముందుకు కదలనియ్యని మధుర ఘట్టాలివి.

గురుప్రాప్తి, మిత్రప్రాప్తి ఎప్పుడూ అకస్మాత్తుగా, అప్రయత్నంగానే జరుగుతాయి. గురువుని, మిత్రుడిని - పేపర్లో ప్రకటన ఇచ్చో, స్వయంవరం చాటించో - అన్వేషించి, ప్రయత్నించి సాధించడం కుదరదు. గురుమిత్రులు భగవంతుడు పంపే కానుకలు. ఇది రామాయణంలో చాల స్పష్టంగా కనిపిస్తుంది. విశ్వామిత్రుడు హఠాత్తుగా సుడిగాలిలా వస్తాడు, రాముడిని తనతో పట్టుకుపోయి విద్యలన్నీ నేర్పి, పెళ్ళి చేయించి పంపిస్తాడు. ఆ తర్వాత తన దారిన తాను పోతాడు.

హనుమంతుడు కూడ హఠాత్తుగా చెట్టుమీదనుంచి కథలోకి దూకి, కథను రక్తి కట్టిస్తాడు. ఇలా ఉన్నట్టుండి చెట్టుమీంచి కథలోకి దూకటం హనుమంతుడికి అలవాటు. ఈయన ప్రవేశం ఎపుడూ హఠాత్తుగానే ఉంటుంది. ఇంతకీ రామాంజనేయుల కలయిక ఎలా జరిగిందో చెప్పుకుందాం.

సీతాదేవిని వెతుక్కుంటూ రామలక్ష్మణులు మాతంగాశ్రమం ఉన్న ఋష్యమూక పర్వతప్రాంతం చేరుకున్నారు. ఈ మహావీరులిద్దరినీ ఋష్యమూక పర్వతంమీదనుంచి సుగ్రీవుడు చూస్తాడు. వాలి తనని చంపటానికి పంపిని మహావీరులేమో అనుకుని భయపడి పారిపోతాడు. అలా పారుపోతున్న సుగ్రీవుడిని ఆపి అతనికి ధైర్యం చెప్పి - వచ్చినవాళ్ళు ఎవరో, మిత్రులో శత్రువులో తెలుసుకునే ప్రయత్నం చేయాలని హితబోధ చేస్తాడు హనుమంతుడు. సుగ్రీవుడు - సరే, ఆ పనేదో నువ్వే సాధించుకొని రా , మనలో సమయానికి తగ్గట్టు మాట్లాడేవాడు, ఎదుటి వాళ్ళ మనసులో సంగతులు కనిపెట్టగల శక్తి ఉన్నవాడు నువ్వొక్కడివే. కాబట్టి నువ్వు పోయి వాళ్ళతో మాట్లాడి, వాళ్ళ ముఖ కవళికల ద్వారా, మాటలద్వారా, వాళ్ళు ఎవరో, వచ్చిన పని ఏమిటో, మిత్రులో, శత్రువులో తెలుసుకు రమ్మని హనుమంతుని పంపిస్తాడు.

రామలక్ష్మణులిద్దరూ ప్రఛ్ఛన్న వేషంలో ఉన్నారు. వారిని భిక్షు రూపంలో సమీపిస్తాడు హనుమంతుడు. ముందు తనెవరో చెప్పకుండా, వారెవరో తెలుసుకోవటానికి చాలా ప్రశ్నలు అడిగి, కూపీ లాగటానికి ప్రయత్నిస్తాడు. కానీ రామలక్ష్మణులిద్దరూ పృధ్వినేలే చక్రవర్తులేగాని చారులు కాదు. ఎదుటివాళ్ళు ముందుగా తమ పేరు చెప్పకుని పరిచయం చేసుకుంటేగాని తమ పరిచయం చేసుకోరు. అందువలన వారిద్దరూ మౌనంగానే ఉండిపోతారు. అపుడు హనుమంతుడు వీళ్ళు చక్రవర్తులేగాని చారులు కారని గ్రహిస్తాడు. వీళ్ళతో సుగ్రీవుడు చెలిమిచేస్తే సుగ్రీవుడికి అన్నివిధాలా శుభం జరుగుతుందని ఆలోచించి, రామలక్ష్మణులకి తానెవరో చెప్పి, సుగ్రీవుని గురించి చెప్పి, సుగ్రీవునికోసం వారి మైత్రిని అర్థిస్తాడు.

అధికారంలో ఉన్న రాజుకి మంత్రిగా ఎవరైనా ఉండగలరుగాని, అధికారం పోయి అడవుల్లో ప్రఛ్ఛన్నంగా తిరుగుతూ, బలమైన శత్రువుల బారినుంచి తప్పించుకుంటూ తిరుగుతున్న రాజుకి మంత్రిగా ఉండి - ఆ రాజుకి తిరిగి రాజ్యాన్ని సంపాదించటం సామాన్యమైన మంత్రుల వల్ల అయ్యేపని కాదు. చరిత్రలో ఇటువంటి మంత్రులు మనకి కొద్దిమందే కనిపిస్తారు. సుగ్రీవుడికి

రాజ్యం సంపాదించిన హనుమంతుడూ, మగధ సింహాసనం చంద్రగుప్తుడికి సాధించిన చాణక్యుడూ, గణపతిదేవుని సాయంతో మనుమసిద్ధికి రాజ్యం సంపాదించిన తిక్కన సోమయాజీ, కృష్ణదేవరాయలుని విజయనగర గద్దెనెక్కించిన తిమ్మరుసూ - వీరందరూ మహామంత్రులే, విద్వాంసులే, పండితులే. వీరందరికీ ఒరవడి దిద్దినవాడు ముందుగా హనుమంతుడే. అతనికీ కితాబు కోదండరాముడే ఇచ్చాడు.

హనుమంతుడి మైత్రీ ప్రస్తావన విన్న రాముడు, లక్ష్మణుడితో ఇలా అంటాడు "లక్ష్మణా! ఈ హనుమంతుడు వాక్యజ్ఞుడిగా కనపడుతున్నాడు. ఋగ్యజుస్సామవేదాలు మూడింటినీ అధ్యయనం చెయ్యనివాడు ఇతనివలె మాట్లాడలేడు. ఇతడు వ్యాకరణాన్ని అంతా అనేకమార్లు తప్పకుండా చదివివుంటాడు. అందువల్లనే ఇతడు ఇంతసేపు మాట్లాడినా నోటివెంట ఒక్క అపశబ్దమూ రాలేదు. ముఖములోగాని, కళ్ళలోగాని, లలాటములోగాని, కనుబొమ్మలలోగాని, ఇంకా ఏ ఇతర అవయవాలలోగాని ఏ వికారమూ కనబడనియ్యకుండా మాట్లాడినాడు. ఆపి ఆపి మాట్లాడలేదు, గబగబా మాట్లాడలేదు, సందిగ్ధముగా మాట్లాడలేదు. హృదయములోంచి కంఠగతము అయిన మాటలను మధ్యమ స్వరములో అన్నాడు. వ్యాకరణసంస్కారముతో అక్షరక్రమముతో దబదబ కాకుండాను, జాగు చేయకుండాను మనోహరముగా మాటలు ఉచ్చరించినాడు. హృదయములో ఏ దోషము లేకుండాను, తల ఆడించకుండాను, కంఠము కంపించకుండాను ఎంత చిత్రముగా మాటాడినాడు. ఇట్లా మాట్లాడితే శత్రుత్వముతో చంపి వేద్దామని కత్తి ఎత్తినవాడు సయితము సంతోషించి వదలిపెట్టుతాడు. ఇటువంటి మంత్రిలేని రాజుకు కార్యసిద్ధి కాదు. ఇటువంటి గుణవంతుడు, కార్యసాధకుడు అయిన దూతల వల్లనే ఏ రాజుకు అయినా సర్వార్థాలు సమకూరుతవి. ఇంత ప్రశంస రాముడు ఇంకెవ్వరికి ఇవ్వలేదు. అందులోనూ మొదటి పరిచయములోనే రాముని అభిమానానికి నోచుకున్నవారు ఇంకెవ్వరూ లేరు. విష్ణువును ప్రసన్నుడిగా చేసుకోవడము చాలా కష్టము అంటారు - ఎన్నో వేల సమ్వత్సరాలు ఘోర తపస్సు చేసినా విష్ణుమూర్తికి కనికరము కలుగదట. అలాంటిది మొదటి చూపులోనే అచ్యుతుడిని ఇంతగా ఆకర్షించిన ఘనత బహుశా హనుమంతుడిదే!

హనుమంతుడు రాముడన్నట్టుగానే మంచి మాటకారి. ఎదుటివారి మనసు తెలుసుకుని సందర్భోచితముగా, సమయోచితముగా మాట్లాడటములో మంచి సిద్ధహస్తుడు. ఇతడు

అనాలోచితముగా, నోటికి ఏదొస్తే అది వాగడు. ముందు పరిస్థితిని అంచనా వేసి, తను సాదించవలసిన కార్యాన్ని అంతా గుర్తు చేసుకునిగాని నోరు విప్పడు. అవసరము అయినదానికంటే ఒక్క ముక్క కూడ ఎక్కువ మాట్లాడడు. ఎవరైనా సలహా అడిగినా, ఉపదేష్టలాగ ఉపన్యాసాలు చెప్పడు. చాల తక్కువలో ఎదుటివాళ్ళకి ప్రయోజనకరముగా మంచి యుక్తులు చెపుతూ మనోహరముగా మాట్లాడతాడు. రామాయణములోంచి మధురమైన సంభాషణలన్నీ ఎంచి చూస్తే, అందులో చాలా వరకు హనుమంతుడి సంభాషణలే ఉంటాయేమో! మచ్చుకి ఒక సంభాషణ పరిశీలిద్దాము.

వాలి మరణవార్త విన్న తార భోరుభోరుమని హృదయవిదారకముగా ఏదుస్తూ ఉంటుంది. అందరూ ఏడుస్తూ ఆవిడని చూస్తూ ఉంటారుగాని, ఆవిదని ఎలా ఊరడించాలో ఎవరికీ బోధపడలేదు. అపుడు హనుమంతుడే ఆవిడని సమీపించి “అమ్మా! వాలికోసం నువ్వు ఎందుకు దు:ఖిస్తావు - ఆయన మరణించేడు. ఏదో ఒక రోజు అందరము మరణించవలసినవారమే. దు:ఖిస్తే బతికున్న నీ గురించి దు:ఖించు, నీ కొడుకు అంగదుడి గురించి దు:ఖించు, కకావికలైపోతున్న ఈ వానర సామ్రాజ్యాన్ని గురించి దు:ఖించు - లేదా వీరందరినీ ఊరడించి కాగల కర్తవ్యము ఏమిటో ఆలోచించు. వాలి మహావీరుడు. యుద్ధములో మరణించాడు. అందులోనూ రామబాణము తగలి మరణించేడు - ఆయన కోసం ఎవరూ దు:ఖించడం భావ్యం కాదు” భగవద్గీతనంతా కాచి వడపోసిన ఉపదేశం ఇది. ఇలా సందర్భోచితముగా హనుమంతుడు మాట్లాడిన సన్నివేశాలు చాల ఉన్నాయి - సీత కనిపించక ప్రాయోపవేశానికి సిద్ధపడిన అంగదాదులకు కర్తవ్యబోధ చెయ్యడమూ, సీతగురించి రాముడికి విన్నవించటమూ, రామదూతగా రావణుడికి జరగబోయే పరిణామాలగురించి చెప్పటమూ, విభీషణుడు రాముడిని శరణు అడిగినపుడు, అతనిని తమలో చేర్చుకోవాలా వద్దా అనే విషయములో రాముడికి సలహా ఇవ్వటమూ - ఇలా చాలా సందర్భాలలో హనుమంతుడు తన సమయస్ఫూర్తి, మాటకారితనమూ, మంత్రాంగమూ చూపించి రాముడి మన్ననలందుకుంటాడు.

ఇంక సుందరకాండలో సీతాదేవితో హనుమంతుడు నడిపించిన సంభాషణ సంగతి చెప్పనే అక్కరలేదు - ప్రపంచ సాహిత్యమంతటిలో ఎన్నదగిన సంభాషణలన్నీ ఎంచితే - అన్నిటికన్నా ముందుండేది - సుందరకాండలో సీతతో సంభాషణలు. కిష్కింధకాండలో వామనుడిలా ప్రవేశించిన

హనుమంతుడు యుద్ధకాండ ముగింపుకొచ్చేసరికి త్రివిక్రముడిలా ఎదిగిపోతాడు. సుందరకాండ గురించి చెప్పకోకపోతే, హనుమంతుడి గురించి ఏమీ చెప్పకోనట్టేగదా! అందరికీ తెలిసిన కథే అయినా, ఎన్నిసార్లు చెప్పినా, ఎవరుచెప్పినా వినాలనిపించే కథ కాబట్టి - మళ్ళా మరొకసారి సుందరకాండ గురించి చెప్పకుందాము.

కిష్కింధకాండ ఆఖరుకొచ్చేసరికి వానర ప్రముఖులందరూ దక్షిణసముద్రం ఒడ్డుకి చేరుకుంటారు. సంపాతి ద్వారా సీత లంకలో ఉన్నదన్న విషయము తెలుసుకుంటారు. అయితే నూరుయోజనాల సముద్రాన్ని ఎవరు లంఘిస్తారు, ఎలా దాటిపోవడము అన్న విషయాలగురించి తర్జనభర్జనలు పడుతూంటారు. హనుమంతుడు మాత్రము దూరముగా ఒక రాయిమీద కూర్చుని ఉంటాడు.

ముందే చెప్పకున్నాం కదా - ఈయన పని అయిపోగానే ఏ చెట్టుమీదకో, కొండమీదకో ఎక్కిపోతాడనీ -ఎవరికైనా అవసరం అయ్యేదాకా అక్కడే ఉండిపోతాడనీను - జాంబవంతుడొచ్చి హనుమంతుడిని సముద్ర లంఘనానికి పురికొల్పుతాడు. కొంతమంది పండితులు హనుమంతునికి తన శక్తి తనకు తెలీదని, ఎవరైనా చెప్తేనే కాని తెలుసుకోలేడనీ అంటారు. కానీ ఇది నిజం కాదేమో - రవీంద్రుడన్నట్టు - తమ శక్తి తెలిసిన నక్షత్రాలు, ఆకాశంలో మిణుగురు పురుగుల్లా కనిపించటానికి సంకోచించవు. స్వయంప్రకాశక శక్తి లేని చంద్రుడికి, గ్రహాలకీ మిడిసిపాటు కాని - నక్షత్రాలకి మిడిసిపడే అవసరం లేదు.

హనుమంతుడిక్కడ మౌనంగా ఉండడంలో చాలా ఔచిత్యం ఉంది. మనం ముందే చెప్పకొన్నట్టు ఈయనకి "కృతమేగాని కర్తవ్యంబు" లేదు కదా! అదీగాక సీతాన్వేషణ తమ రాజుకి చాల ముఖ్యమైన పని. రాజుకి ఇష్టమైన కార్యాన్ని - ఎంత కష్టమైనా సరే సాధించి - రాజు మెప్ప సంపాదించాలని అందరూ అనుకుంటారు కదా. అదీకాక, తనతో వచ్చినవారు ఎవరూ కూడ కొలువులో తన కింద పనిచేసే ఉద్యోగులు కాదు. అందరూ తనతో సరిసమానమైన సేనాధిపతులూ, యూథపతులూను. అంగదుడైతే, చిన్నవాడైనా యువరాజు. ఆపైన, అందరికన్నా పెద్దవాడు, బ్రహ్మదేవుడి పుత్రుడు జాంబవంతుడు, సుగ్రీవుడి మామగారైన సుషేణుడూ, సర్వసేనాధిపతి నీలుడూ, నలుడు, మైందద్వివుదులూ, గజుడూ, గవాక్షుడూ, గంధమాదనుడూ - ఇలా అందరూ మహావీరులూ, సేనాధిపతులూను. అందువల్ల మిత్రులెవ్వరైనా ముందుకురికితే

వారికోసం అవకాశం ఒదులుకోవటానికి సిద్ధపడిన హనుమంతుడు మౌనంగా ఉండి స్నేహమూ, పెద్దరికమూ చూపించేడుకాని తన శక్తి తెలియక కాదు. మిత్రుల కోరికమీద సీతాన్వేషణకి ఒప్పుకోవడంద్వారా - హనుపంతుడు ప్రభుకార్యాన్నీ, రాజకార్యాన్నీ, మిత్రకార్యాన్నీ, స్వకార్యాన్నీ - అన్నిటినీ కలుపుకున్నాడు కూడ. కేవలం రాజుకోసం కాకుండా, తన మిత్రులకోసం ముందుకురకడంలో హనుమంతుడి ఔచిత్యం కనిపిస్తుంది.

సరే - మిత్రులంతా హనుమంతుడిని ప్రార్థించేరు, ఆయన శక్తి గుర్తు చేసేరు. అందరికోసం సీతాన్వేషణకి పూనుకొని, తన శరీరాన్ని పర్వతంలాపెంచి, దగ్గరలోఉన్న మహేంద్రగిరిపైకెక్కి, కాళ్ళు తన్నిపెట్టి చేతులుచాచి ఆకాశంలోకి నూరు యోజనాల సముద్రాన్ని లంఘించడానికురికేడు. ఇక్కడనుంచి సుందరకాండ ప్రారంభమౌతుంది. రామాయణం అంతట్లోకి రాముడులేని సుందరకాండే అందమైనది, ముఖ్యమైనదీను. సుందరకాండ లేని రామాయణంలో రక్తీ లేదు, ముక్తీ లేదు. సుందరకాండ లేకపోతే రామకథ చందమామ పుస్తకాల్లో ఓ రాజకుమారుడి కథ మాత్రమే!

సుందరకాండకి వాల్మీకి అసలీపేరెందుకు పెట్టినట్టు? మిగతా కాండలకి - బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ అంటూ కథానుగుణమైన పేర్లు పెట్టి రాముడులేని ఈ కాండకి సుందరకాండ అని ఎందుకు పేరు పెట్టటం? అసలీ కాండకెందుకంత ప్రాముఖ్యత? సుందరకాండలో కథ పెద్దదేమీ కాదు - హనుమంతుడు సముద్రాన్ని దాటడం, సీతకోసం లంకలో వెతకటం, అశోకవనంలో ఆవిడని కలుసుకోవటం, రాక్షసులతో యుద్ధం, రావణుడి కొలువులో రాముని సందేశం వినిపించటం, ఆపైన లంకా దహనం - ఇదీ కథ. మొత్తం కథంతా ఒక్క రోజులో నడచిన కథ. సాయంకాలానికి లంక చేరుకున్న హనుమంతుడు మర్నాడు సాయంకాలానికి తిరిగి మిత్రులను కలుసుకుంటాడు. ఈ పాటి కథకు ఎందుకింత ప్రాముఖ్యత? హనుమంతుని గురించి మనం పూర్తిగా తెలుసుకోవాలంటే ఈ ప్రశ్నలకి సమాధానాలు వెతకాలి. ఈ ప్రశ్నలకి సమాధానాలు కావాలంటే ఇంకొన్ని ప్రశ్నలు వేసుకోకతప్పదు.

రావణుడసలు సముద్రానికవతల ఎక్కడో లంకలో ఎందుకు ఉండటం? ఏ పర్వతం మీదో, దండకారణ్యానికి అవతల ఏ అడవుల్లోనో కాకపోతే హిమాలయాల్లోనో ఉండొచ్చు కదా? సముద్ర లంఘనం, సేతు బంధనం ఎందుకు? ఒకవేళ రాముడి పరాక్రమాన్ని వర్ణించదలుచుకుంటే -

పాతాళందాకా కన్నం కొట్టేడనో, కొండలు పిండి చేసేడనో చెప్పుకోవచ్చుకదా. ఇలా చెప్పినందువల్ల కథలో మార్పేమీ పెద్దగా ఉండదు. పోనీ ఇది నిజంగా జరిగిన కథ అనుకుందాం. రావణుడు సీతని ఏ ఒంటిస్తంభం మేడలోనో, చెరసాలలోనో బంధించకుండా, పారిపోవడానికి వీలుగా, అందరూ చూసిపోవడానికి వీలుగా అశోకవనంలో ఎందుకు ఉంచటం? పోనీ ఉంచినవాడు, ఉదయం లేవగానే రాచకార్యాలు చూసుకోకుండా, ఆవిడ దర్శనం చేసుకుని నమస్కారాలు పెట్టి విన్నపాలు చేసుకోవటం ఎందుకు?

అదీ గాకుండా దిక్పాలకులందరినీ శాసించినవాడు, ఇంద్రాది దేవతలందరినీ ఓడించిన మహావీరుడు - సీతని మారువేషంలో ఎత్తుకెళ్ళటం దేనికి? పద్నాలుగువేలమంది రాక్షసులని ఒంటిచేత్తో చంపిన రాముడి పరాక్రమానికి వెరిచేడనుకుందాం, కానీ లక్ష్మణుడిని కూడ ఎందుకు అవతలకి పంపించటం? రావణుడేదో సులువు చూసుకున్నాడనుకొందాం. రాముడు ఉన్నచోటు నుంచే ఏ బ్రహ్మాస్త్రాన్నో సంధించవచ్చుకదా? సీతాదేవి ఎక్కడుందో తెలీదు కాబట్టి అలా చేయలేదనుకొందాం. ఆయన సీతను 'వెతుక్కొంటూ' అడవులవెంట పిచ్చివాడిలా తిరగటం ఎందుకు? పక్కనే ఉన్న అగస్త్యాశ్రమానికి పోయి త్రికాలజ్ఞుడైన ఆ మహర్షిని సీతాదేవి గురించి అడగచ్చుకదా? ఇలాంటి - చొప్పదంటు ప్రశ్నలే కావచ్చు - చాల ప్రశ్నలు రామాయణం చదువుతున్నపుడు తలెత్తుతాయి. వీటన్నిటినీ అనుసంధానం చేసే సమాధానం ఏదైనా ఉందా?

రామరావణులనే ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన కథగా మనం రామాయణాన్ని చదివితే - ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలు దొరకటం చాల కష్టం. ఇటువంటి దృక్పథం మనకి రామాయణంలో అర్థం చెప్తుందేమోగాని, దీనివల్ల మనకి రామాయణంలో పరమార్థం మట్టుకు చిక్కదు.

రూపుకట్టిన పరబ్రహ్మ రాముడు, సాకారమైన సత్యమే సీత, అహంకారం కుంభకర్ణుడు, మోహమే రావణుడు. ఆకలిదప్పలు జయించి అదుపులోవున్న ఇంద్రియాలే లక్ష్మణుడు, భగవంతుని కార్యానికంకితమైన ఇంగితజ్ఞానమే సుగ్రీవుడు. మనకందుబాటులో ఉండే చిత్తానికందకుండా ఉండే Subconscious అనే సముద్రానికవతల ఉండే అంతరాత్మ లంకలోని అశోకవనం. ఇంగితజ్ఞానానికి, అంతరాత్మకి మధ్య ఉండే అగాధమైన Subconscious సముద్రం.

ఇంక, భగవంతుని సహకారంతో సత్యానుభూతికై చేసే ఆధ్యాత్మిక సాధనే మూర్తీభవించిన హనుమంతుడు. రామరాజ్యమే ఆత్మజ్ఞానము.

అనుభూతికి అద్దం పట్టి, దానికి భాష్యం చెప్పి మానవుడికి తోవచూపించే mఅహాకావ్యం ప్రతి వాఙ్మయం లోనూ ఒక్కటైనా ఉంటుంది. మనకున్న మణిదీపం రామాయణం.

మహాకవులందరూ తాము రాసినదాంట్లో చెప్పేదానికన్నా, తమ రచనలలో రాయకుండా చేప్పేదే ఎక్కువుంటుందట. మహాకవులందరికీ మహాకవి వాల్మీకి.

అనుభవిస్తేనే కాని తెలియనిదాన్ని మాటలలో ఎలా చెప్పగలం? ఎంతో మంది మహర్షులు, ప్రవక్తలూ - భగవత్స్వరూపాన్ని గురించి., ఆత్మజ్ఞానాన్నిగురించి రకరకాలుగా వివరించేరు. ద్వైతమని, అద్వైతమని ఇలా ఎన్నో సిద్ధాంతాలను గురించి చెప్పేరు, కర్మయోగమనీ, భక్తియోగమనీ, రాజయోగమనీ ఇలా ఎన్నో పద్ధతుల గురించి చెప్పేరు. ఇంకా మంత్రాలనీ, తంత్రాలనీ చెప్పేరు. కానీ ఒక సాధకుడి అనుభూతిగురించి, అతను అనుభవించవలసిన కష్టాలగురించి, అతడు అధిగమించవలసిన అవరోధాలను గురించి, అతను చివరకి సత్యాన్ని ఎలా కనుగొంటాడో ఎలా చెప్పగలరు? నిశ్శబ్దాన్ని ఎంత మహాకవైనా శబ్దాలలో ఎలా చెప్పగలడు?

అటువంటి ప్రయత్నం చేస్తే అది సముద్రానికావలతీరాన ఆకాశం తన మీదకు వంగి చెప్పిన నిశ్శబ్ద రహస్యాన్ని తీరానికి మోసుకొచ్చే కెరటాల ఘోషలాగే ఉంటుంది. ఎంత మహాకవైనా, తన అనుభూతిని మాటల్లోకి అనువదించడానికి ప్రయత్నం చేస్తాడే కాని, దానికి పూర్తిగా న్యాయం మట్టుకు చెయ్యలేడు.

కడలికి ఆవలతీరాన, ఆకాశం
తనతో పలికిన నిశ్శబ్ద సంగీతాన్ని
తీరానికి మోసుకొచ్చే కెరటాలు -
అంతర్మథనం చేసిన కవి
సృష్టించిన తప:శిల్పాలు.

అందుకేనేమో మహాకవి వాల్మీకి ఇటువంటి కెరటాలరొద పెట్టరు. ఆ నిశ్శబ్ద సంగీతాన్ని నువ్వే అనుభవించు అంటూ మనల్ని హనుమంతుని వీపుకి కట్టి అవతలిఒడ్డుకి విసరేస్తారు. ఇది వాల్మీకి మహాకవి ప్రజ్ఞ, సుందరకాండలో ఆయన ఆవిష్కరించిన సౌందర్యమూను.

సుందరకాండ దగ్గరకొచ్చేసరికి వాల్మీకి కలం రాసి రాసి మెత్తబడింది, భావం పదునెక్కింది, భాష ఊపందుకొంది, కవిత్వం కొత్త రంగులలుముకొంది - ఇంక కథ రక్తికట్టకేమిచేస్తుంది? రాముడిని ఎడబాసి, అశోకవనంలో ఉన్న సీత - సందేహంలో పడ్డ స్మృతివాక్యం వలెనూ, విశ్వాసంకోల్పోయిన శ్రద్ధ వలెనూ ఉందంటారు. ఇంతకంటే సుందరమైన కవిత్వం ఎవరు చెప్పగలరు? ఒకపక్క ఆవిడ పరిస్థితిని మనసుకు హత్తుకునేలా వర్ణిస్తూనే - సీతారాముల అద్వైతాన్ని ఆవిష్కరించేరు. త్రిజట స్వప్న వృత్తాంతము విన్న సీత ఎడమకన్ను - నీటిలోపల ఈదుతున్న చేపపిల్ల దెబ్బకి అదిరిన కమలంలా అదిరిందట. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న లక్షణభాష్యం ప్రకారం - ఈ ఒక్క వాక్యం చాలు, ఈ కాండని సుందరకాండ అని పిలవడానికి. సుందరకాండనిండా ఇటువంటి మనోహరమైన కవిత్వమే. అందువల్ల ఎలా చూసినా నిజంగానే సుందరమైనది సుందరకాండ.

Truth is Beauty అంటారు కదా? సత్యస్వరూపిణి అయిన సీతను అన్వేషించే కథ కాబట్టి - సుందరకాండ. శివుడు అంటే శుభకరుడు - అందరికీ శుభం చేసే శివరూపుడైన హనుమంతుడు కథానాయకుడు కాబట్టి - సుందరకాండ. సత్యం అశోకవనంలోనూ, శివుడు కథానాయకుడుగాను, కథ సుందరమైనది కాబట్టి - సత్యం, శివం, సుందరం- సుందరకాండ.

దీని లోతులని - అనుభవించి, ఆలోచించి తపించి తెలుసుకోవలసిందేగాని, సహేతుకంగా భాష్యం చెప్పడానికందని అందమే సుందరకాండ.

అందం అర్థం కానక్కరలేదు కదా! ఆస్వాదించి, ఆనందించ గలిగితే అదే దాని పరమార్థం.

హకీమ్ సనాయ్ అనే పర్షియన్ కవి చెప్పినట్టు :

"నీ మేధస్సు - హేతువు, నిదర్శనం, సిద్ధాంతాలనే
చీకటి సందుగొందులలో సత్యం కోసం వెతకొచ్చు గాక!
కాని, నీ హృదయానికది - ప్రేమ అనే సుందర నందనోద్యాన
వనంలో బాహాటంగానే తప్పక దొర్కుతుంది కదా "

దొరికినవాడికి "అయ్యో - ముందే ఇక్కడెందుకు చూడలేదు" అనిపిస్తుంది. కాని దొరికే అంతవరకు వెతకక తప్పదు కదా? పాపం హనుమంతుడు కూడ ముందర లంకా నగరం సందుగొందులలోనే చీకటిలోనే సీతకోసం వెతికాడు. నిరాశ తప్ప మరేమీ దొరకలేదక్కడ.

ఆత్మహత్యకి సిద్ధపడ్డాడు. ఆత్మహత్యవల్ల తనకే కాకుండా తన మిత్రులకీ, ప్రభువుకీ కూడ అనర్థం అనిపించింది. ఉత్సాహంతో మళ్ళీ వెదికేడు - అమ్మవారక్కడ ఉంటే కదా కనిపించడానికి? తిరిగి తిరిగి , అలసిపోయి సత్తువ లేక నిరాశతో - హేతువాదంతో పోరాడలేని గజేంద్రుడిలా - "అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అంటూ తన ప్రభువుకి మొరపెట్టుకున్నాడు. అపుడు కనిపించింది తెలతెలవారుతుండగా ఎదురుగుండా అశోకవనం. ప్రకృతి సౌందర్యం అంటే ఎంతో ఇష్టపడే సీతాదేవి ఇక్కడకు రాకపోతుందా అనుకున్నాడు. వెతకటం మానేసి, ఆవిడ రాకకై అశోకవనంలో తిష్టవేసి ఎదురుచూద్దాం అనుకున్నాడు. ఈయన రాకకోసమే చూస్తున్న అమ్మవారే ఎదురు వచ్చింది. ఇదీ కథ. ఒక రకంగా చెప్పాలంటే - ఇక్కడనుంచే అసలు కథ ప్రారంభమవుతుంది. మహా యుద్ధం అంతా ముందుంది కదా! జ్ఞానోదయం అయ్యాకనే కదా అసలు జీవితం ప్రారంభమవుతుంది. యుద్ధకాండలోకి తర్వాత వద్దాంకాని, ముందు హనుమంతుడు మహేంద్రగిరి మీదనుంచి సముద్రంపైకి ఎగిరి లంకలో ప్రవేశించి సీతా దర్శనం దాకా - అతను ఎదుర్కొన్న అడ్డంకులు, అధిగమించిన అవరోధాలు, అనుభవించిన యాతనలూ - ఇవన్నీ కూడ మనం విపులంగా కాకపోయినా, కొంచెం క్లుప్తంగానైనా పరిశీలించాలి. మహేంద్రగిరి మీదనుంచి, ఆకాశవీధిలోకి ఎగిరి సముద్రం మీద వాయువేగంతో పోతున్న హనుమంతునికి - ఆశ చూపించి ఆపేద్దామనే ప్రయత్నాలు జరిగేయి. ఇంత దూరం వచ్చేవు కదా , ఇక చాల్లే. కాకపోతే - కాస్సేపు ఆగి, విశ్రాంతి తీసుకుని పోరాదా అంటూ చనువుగాను, చల్లగాను చెప్పి చూసారు. ముందు తనదారికడ్డం వచ్చి, ఆ తర్వాత నీ మిత్రులమే, నీ మంచికోసమే అనే నంగనాచుల బుట్టలో పడే నస్మరంతి కాదు హనుమంతుడు. ముందు తోకతో ఒక్కటిచ్చుకుని, రామబాణాలు, రామదూతలు మధ్యలో ఆగరులే, తిరుగు ప్రయాణంలో తప్పక చూద్దాంలే అని మంచిగానే తప్పించుకున్నాడు. శ్రీశ్రీగారన్నట్టు నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే, తలలో మేకు దిగ్గొట్టాలని కొందరూ, కాకపోతే కాళ్ళు పట్టుకుని పైకొద్దామని కొందరూ ప్రయత్నిస్తారు కదా!

వీడు నయాన చెపితే వినే రకం కాదు - భయపెట్టి చూద్దాం అనుకున్నారు పండితులందరూ. సురసని పంపించేరు. నువ్వు ముందుకెలా వెళ్తావో చూస్తానంది - సరే చూడన్నాడు. నువ్వు నా నోట్లో పడి తీరాలంది - సరే కానీ, నేను పట్టేటంత నోరుంటే తెరువు -

అలాగే పడతానన్నాడు. ఆవిడ ఆకాశం అంత నోరు తెరిచింది, ఈయన అంగుష్ఠం అంత చిన్నవాడై ఆవిడ నోట్లో పడి పైకొచ్చేసాడు - ఇంక పోనా అని అడిగాడు. ఆవిడ ఇప్పటికీ ఇంకా ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టుకునే ఉందట!

ఆశకి లొంగడు, అడ్డంకులకి కుంగడు - అసాధ్యుడే అనుకుని - ఇంక యుద్ధమే ప్రకటించేరు. నీడ పట్టి సముద్రంలోకి లాగేద్దామనుకుంది సింహిక. దాని నోట్లో దూరి గుండెకాయలాగి అవతల విసిరేసాడు - నా దారికడ్డొస్తే సహించేది లేదన్నాడు. ఇలా ఆశలూ, అడ్డంకులూ, అవరోధాలు అధిగమించి లంకాద్వీపంలో దిగేడు. అక్కడనుంచి రావణాసురుడి లంక - ఎత్తైన కోటగోడలతో, బురుజులతో, చుట్టూ అభేద్యమైన కందకాలతో, ఆకాశాన్నంటుతున్న హర్మ్యాలతో, వేలకొద్దీ రాక్షసులు ఏమరుపాటు లేకుండా కాపలా కాస్తుండగా - దేవేంద్రుని అమరావతిలా దుర్భేధ్యంగా కనిపించింది. ఈ లంకాపట్టణాన్ని అసలు వానరసేనలు ముట్టడించగలవా? రామలక్ష్మణులకైనా దీన్ని ఛేధించడం అవుతుందా అనిపించింది హనుమంతునికి. అసలు కార్యం అతను చేసుకుంటాడు కదా, మనం వచ్చిన పని ముందు చూద్దాం అనుకున్నాడు. రాక్షసులకి చిక్కకుండా పని చక్కబెట్టుకోవాలంటే చీకటి పడేంతవరకు ఆగడమే మంచిదనుకున్నాడు. చీకటి పడినతర్వాత తన నిజరూపాన్ని దాచి, చిన్నపిల్లిలా మారి లంకానగరం సమీపించేడు. దూరంనుంచి దుర్భేధ్యంగా కనిపించిన లంక, దగ్గరనుంచి చూసాక - పర్లేదు, దీన్ని పడగొట్టొచ్చు అనిపించింది. ఇంతలో లంకాధిదేవత - లంకిణి లంకలో ప్రవేశించబోతున్న హనుమంతుణ్ణి అడ్డుకుంది. ఆడది కదా - మంచి మాటలతో నచ్చచెప్పాలని ప్రయత్నించేడు - ఆవిడ ఎదురు తిరిగింది. ఆ లంకిణిని లొంగదీసుకొని లంకలోకి ఎడమపాదంతో అడుగుపెట్టాడు. చిత్రమేమంటే, హనుమంతుడికి అడ్డుపడ్డవాళ్ళందరూ ఆడవాళ్ళే.

రాముడు సీతాదేవిని గురించి చెప్పిన గుర్తులన్నీ మననం చేసుకుంటూ - అలాంటి గుర్తులున్న స్త్రీకోసం - లంకంతా - చూడవలసినచోట్ల, చూడకూడనిచోట్ల - అన్ని ప్రదేశాలలోను వెదికిచూసాడు. పానశాలల్లో, చిత్రగృహాల్లో, రాక్షసుల ఇళ్ళల్లో, వీధుల్లో, గుళ్ళు, గోపురాలు, ప్రాసాదాలు, వసంతమంటపాలు - ఇలా అన్నిచోట్లా చూసేడు.

రావణాసురుడి మందిరంలో అన్నిచోట్లా వెదికేడు. రావణుడి శయనమందిరంలో ఆదమరిచి నిద్రపోతున్న రావణుడి భార్యలందరినీ చూసేడు - వారి మధ్య ఎక్కడైనా తను వెదుకుతున్న

జానకి కనిపిస్తుందేమో అని ఆశతో. ఇంతలో ఒక ఎత్తైన మంచం మీద పడుకునివున్న మండోదరి కనిపించింది - సీతేనేమో అని హనుమంతుడంతటి వాడు కూడ పొరపడ్డాడు. ఎగిరి గంతులేసాడు, తోక ముద్దు పెట్టుకున్నాడు - ఇలా పాపం ఆనందంతో కోతిచేష్టలన్నీ చేసేడు.

రాముడి భార్య, రాముడిని ఎడబాసి ఇలా రావణుడి శయ్యాగృహంలో అలంకరించుకొని ఇంత సుఖంగా నిద్రిస్తుందా అనే సందేహం కలిగింది. సీతే అని నమ్మేస్తే, వచ్చిన పని అయిపోయినట్టే, నమ్మకపోతే - ఇంక ఎక్కడ వెతకాలో తెలీదు. పాపం చాల ఊగిసలాడాడు. చివరకి - ఈవిడ సీత కాదు, కాలేదు, కానే కాదు అనుకున్నాడు. కాని ఇంకెక్కడ వెతుకుతాడు? వెదికి వెదికి వేసారిపోయాడు. వెనక్కి పోదాం అనుకున్నాడు. కాని, రాముడికి సీత కనిపించలేదని చెప్తే ఆయన బతకడు, ఆయన లేకపోతే లక్ష్మణుడుండడు, ఆ తర్వాత సుగ్రీవుడుండడు, భరత శత్రుఘ్నులుండరు - అంతా అనర్థమే. సీత కనిపిస్తే వెనక్కి వెళ్ళడం, లేకపోతే తనే ఆత్మహత్య చేసుకోవడమో, ఎక్కడో తపస్సు చేసుకోవటమో చెయ్యాలి కాని - ఆవిడ దర్శనం చేసుకోకుండా వెనక్కి మాత్రం పోయేది లేదని నిశ్చయించుకున్నాడు. సాధకులందరికీ ఇది వాల్మీకి చేసిన హెచ్చరిక. కార్యం సాధించకుండా వెనక్కి వెళ్ళే మార్గం లేదు. మళ్ళీ లంకంతా వెదికి చూసేడు. ఇంతకు ముందు చూడని ప్రదేశాలన్నీ కూడ చూసేడు - సూది మొన మోపేంత స్థలం కూడ వదలకుండా అంతా చూసేడు. ఎక్కడా ఆవిడ కనిపించలేదు. నీరసం వచ్చింది, అలుపొచ్చింది, చిరాకేసింది, ఆఖరికి విసుగుకూడ కలిగింది.

ఎవరితో చెప్పుకోడానికిగాని, సలహా అడగడానికి కూడ ఎవరూలేరు - ఒంటరి ప్రయాణం. చివరికి తెలతెలవారుతుండగా - ఎదురుగా అశోకవనం కనిపించింది. ఒకవేళ సీత లంకలోనే ఉంటే - ఈ ఉద్యానవనంలోకి రాకపోతుందా అని అశోకవనంలోకి ప్రవేశించేడు హనుమంతుడు. అక్కడ కొంత దూరం పోగానే, రాక్షసస్త్రీలమధ్య చిక్కి శల్యమైపోయిన ఒక స్త్రీ కనిపించింది. ఆవిడలో రాముడు చెప్పిన సీతాదేవి రూపురేఖలన్నీ స్పష్టంగా కనిపించేయి. రావణాసురుడు ఆకాశంలో సీతను ఎత్తుకుపోతుండగా ఋష్యమూకపర్వతంనుంచి తనుకూడ ఆవిడని చూసేడు కదా - అవన్నీ గుర్తుకుతెచ్చుకుని - పరీక్షగా ఆవిడవంక చూసేడు. ఆవిడున్న పరిస్థితినిబట్టి, తనకు తెలిసిన గుర్తులనుబట్టి ఈవిడే సీతాదేవి అని నిశ్చయం చేసుకున్నాడు. అప్పటికి లంకలోనూ, హనుమంతుడి జీవితంలోనూ సూర్యోదయం అయ్యింది.

అక్కడ శింశుపా వృక్షంపై దాంకుని హనుమంతుడు చూసిన సీతాదేవి ఎలా ఉందంటే మాసిన చీరతో, ఉపవాసాలతో క్షీణించి, భయంకరమైన రాక్షసస్త్రీల మధ్య గ్రహణం పట్టిన చంద్రుడిలా, కుక్కలమధ్య లేడిపిల్లలా, పొగలుకమ్మిన అగ్నిశిఖలా ఉంది. రాముడిని ఎడబాసి ఉండటంవల్ల, సందేహంలోపడ్డ స్మృతివాక్యంలాగ, క్షీణించిన సంపదలాగ, విశ్వాసంపోయిన శ్రద్ధలాగ, భగ్నమయిన ఆశలాగను, విఘ్నాలు వచ్చిన కార్యసిద్ధిలాగను, కలతపడిన బుద్ధి లాగను, అపవాదువల్ల చెడిన కీర్తిలాగను కనిపించింది. వాల్మీకిగారికిలా తోచిందేమోకాని, హనుమంతునికి మాత్రం ఆవిడ అభ్యాసం లేనందువల్ల మరపు తగిలిన విద్యలాగను, భాషా సంస్కారము లేనందువల్ల ఒక అర్థానికి ఇంకో అర్థం స్ఫురింపచేసే వాక్కు లాగను కనిపించిందట. అందుచేత ఆవిడని పదేపదే చూసేడు - రాముడు చెప్పిన ఆనవాళ్ళు అన్నీ ఆలోచించేడు. రాముడు చెప్పిన ఆనవాళ్ళు అన్నీ సుఖసంతోషాలతో, అంత:పురంలోనూ, పర్ణశాలలలోనూ తనతో ఉన్న సీతవి. ఆడవాళ్ళ రూపురేఖలు వాళ్ళ పరిస్థితులవల్ల చాల మారిపోతాయి. అందువల్ల అతికష్టంమీద ఆవిడే సీతాదేవి అని హనుమంతుడు నిర్ధారణ చేసుకున్నాడు. తర్వాత ఏమి చెయ్యడమా అని ఆలోచించసాగాడు. తను నిర్ధారణ చేసికొన్నంత మాత్రాన సరిపోదు కదా, నిదర్శనం కావాలి, సాక్ష్యాధారాలు కావాలి. పూర్తిగా తెలుసుకోకుండా ఎదుటపడితే మొదటికే మోసం వస్తుంది కదా? అందుచేత హనుమంతుడు తొందరపడలేదు - అవకాశంకోసం ఎదురుచూస్తూ, సీతాదేవిని అలా కళ్ళప్పగించి చూస్తూ - ఈవిడని ఎడబాసి రాముడు ఇంతకాలం ఎలా సహించేడో అనుకుంటూ - ఆ శింశుపావృక్షం శాఖల్లో దాంకుని కూర్చుని వేచిచూడసాగేడు.

ఇంతలో రావణాసురుడే తన భార్యలందరినీ వెంటబెట్టుకొని సీతాదేవి దగ్గరకు వచ్చేడు. ఆవిడని రకరకాలుగా ప్రలోభ పెట్టడానికి అన్ని ప్రయత్నాలు చేసేడు, ఆవిడ మనో నిశ్చయాన్ని, రాముడి మీద ఆవిడ నమ్మకాన్ని దెబ్బతియ్యడానికి చూసేడు. యవ్వనం వృధా చేసుకోకంటూ సలహాలు చెప్పేడు, తనతో ఉంటే ఎంత సుఖం అనుభవిస్తుందో అరచేతిలో స్వర్గం చూపించేడు. తను ఎంత గొప్పవాడో, తన పరాక్రమం, బలం, సంపద- ఇవన్నీ కూడ ఆవడకి వివరించేడు.

ఆవిడ వినలేదు- పైగా ధిక్కరించింది, గడ్డిపోచ కన్నా హీనంగా చూసి తృణీకరించింది. దాంతో రావణుడు రెండు మాసాలు గడువు పెట్టేడు. వినకపోతే ఆవిడనుభవించే చిత్రహింసలన్నీ వర్ణించి

మరీ చెప్పేడు. ఎలాగైనా సరే ఆవిడ మనస్సు మార్చమని అక్కడున్న రాక్షస స్త్రీలందరికీ చెప్పి- నిరాశగానే వెనక్కి పోయేడు.

అప్పుడు అక్కడున్న రాక్షస స్త్రీలందరూ- సీతని రకరకాలుగా- ఒకవైపు ప్రలోభ పెడుతూ, మరొక వైపు భయపెడుతూ- చిత్ర విచిత్రంగా ఆవిడని లోబరుచు కోడానికి ప్రయత్నాలు చేసేరు. ఆవిడ ససేమిరా అంది. కావాలంటే చంపుకు తినండంది.

రావణుడు సీతని ఏ కారాగారం లోనో ఎందుకు పెట్టలేదు? శారీరకమైన చిత్ర హింసలెందుకు పెట్టలేదు అనే ప్రశ్నలన్నిటికీ- ఈ మధ్య మనస్తత్వ శాస్త్రజ్ఞులు "Brain Washing" గురించి చేసిన పరిశోధనలల్లో సమాధానాలు దొరుకుతాయి. కొరియా యుద్ధంలో పట్టు బడ్డ అమెరికన్ సైనికులని, కమ్యూనిష్ట్ లుగా మార్చేరు. దీని తర్వాత "Brain Washing" అనే అంశం మీద చాల పరిశోధనలు జరిగేయి. ఒక మనిషిని లో బరుచుకోవాలంటే, కారాగారంలో పెట్టి, చిత్రహింసలు పెట్టక్కరలేదు. ఆ వ్యక్తిని మెల్లి మెల్లిగా శారీరకంగా దుర్బలుడిని చేసి, ఒంటరివాడిని చేసి, రోజు ఒక పక్క నుంచి భయపెడుతూ, మరోపక్క నుంచి మాలో చేరితే నీకంతా మంచే అని ఊరడిస్తూ, మేమేమీ చెడ్డ వాళ్ళం కాదు, మా తరహా కొంచెం వేరు అంతే అని సర్దిచెప్తూ- చాల తెలివిగా, బందీగా దొరికిన వ్యక్తి మనోబలాన్నంతా హరిస్తారు. పాలుతాగే చంటి పిల్లాడికి, తల్లి, మెల్లి మెల్లిగా అన్నం అలవాటు చెసినట్టూ, అడవిజంతువులని మచ్చిక చేసుకొన్నట్టు- మనుషులని కూడ లోబరుచుకోవచ్చు. మనకి తెలియకుండానే, మనమీద ప్రభావం చూపించే, మానసిక, భౌతిక, శారీరక శక్తులన్నిటినీ- చాల తెలివిగా ప్రయోగిస్తారు. ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, పత్రికలు కూడ- ప్రజాభిప్రాయాన్ని తమకు కావల్సిన విధంగా మలచుకోటానికి- ఇలాటి పద్ధతులు ఉపయోగిస్తాయిని Noan Chomsky అనే ఆయన ఈ మధ్యనే "Manufacturing Consent" అనే పుస్తకంలో చాల చక్కగా చూపించేరు.

వాల్మీకి మహర్షి, రావణాసురుడూ ఇద్దరూ కూడ గొప్ప మనస్తత్వ శాస్త్రంలో ఆరితేరిన వారే. రావణుడు సీతని లోబరుచుకోవడానికి- ముందు ఆవిడ అందాన్ని పొగుడుతాడు, నువ్విలా మాసిన చీరలు కట్టుకొని, ఉపవాసాలు చెయ్యడం ఏమీ బాగులేదంటాడు. దేవేంద్రభోగాలు

అనుభవించ వలసిన దానివి- ఇలా తపస్విలా ఉండటేమిటి అంటాడు. ఇంకా ఎందుకింకా రాముడొచ్చి నిన్ను రక్షిస్తాడనే ఆశ- లంకకి ఎవ్వరూ రాలేరు అని లంక ఎంత దుర్భేద్యమో వర్ణించి చెప్తాడు. సీతని కారాగారంలో కాకుండా ఉద్యానవనంలో ఉంచడం లోనే రావణుడి ప్రజ్ఞ తెలుస్తుంది. లంకే పెద్ద కారాగారం, అక్కడ నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు- అందుచేత వేరే కారాగారం అవసరం లేదు అని ఎవరూ చెప్పకుండానే సీతకి తెలిసేటట్టు చేసే తెలివైవ పథకం అది.

ఆ తర్వాత- ఈ పాటికి రాముడు ఇంకెవరినో పెళ్ళాడి ఉంటాడు, లేదా నీకోసం వెదుకుతూ, నిద్రాహారాలులేక- అడవుల్లో పిచ్చివాడై తిరుగుతూ ఈ పాటికి పోయే ఉంటాడేమో అని అనుమానాలు రేకిస్తాడు. నిన్ను ఎవరో వచ్చి రక్షిస్తారను కోవటం జరిగే పనికాదు- అసంభవం అంటాడు (Rescue is impossible).

తర్వాత తనగొప్పలన్నీ చెప్తాడు. ఆశలు చూపిస్తాడు- మహారాణిని చేస్తానంటాడు. ఆవిడ బంధువులందరికీ రాజ్యాలు, ఐశ్వర్యం ఇస్తానంటాడు. నేనేం చెడ్డవాడిని కాదు- మాలో ఇలా నచ్చిన ఆడదాన్ని ఎత్తుకురావడం అధర్మం కాదంటాడు.

ఎన్నాళ్ళిలా జరగని దాని గురించి ఎదురు చూస్తూంటావు? నేనెత్తుకొచ్చిన స్త్రీలందరూ నన్ను వరించేరు - ఎప్పటికైనా నువ్వు మనసు మార్చుకోవలిసిందే - మరో దారి లేదంటాడు (Resistance is futile)

ఇలా మెల్లి మెల్లిగా సీత ఆత్మ స్థైర్యాన్ని కుంగదీస్తూ, ఇంకో పక్క ఆశలు రేపుతూ ఉంటాడు రావణుడు. ఇంతేకాదు- రావణుడు ప్రయోగించిన ఇంకో అద్భుతమైన అస్త్రం కూడ ఉంది. అశోకవనంలో సీతకి కాపలాగా భయంకరమైన రాక్షసస్త్రీలని ఉంచుతాడు. వీళ్ళందరూ అతివికారంగా, మద్యమాంసాలు భక్షిస్తూ అతి భయంకరంగా ఉంటారు. తను వచ్చినపుడు తనతో అందమైన, సుందరులైన తన భార్యలందరినీ వెంట తెస్తూ ఉంటాడు. ఎప్పడో ఒకరోజు, ఈ భయంకరుల మధ్య ఉండటం కన్నా, స్నేహితుల్లా కనిపించే రావణుడి భార్యల మధ్య ఉండాలనిపించొచ్చు. ఆ తర్వాత బెదిరిస్తాడు- మాట వినకపోతే ఎలాంటి చిత్ర హింసలు అనుభవించాలో చెప్తాడు.

ఈ మధ్యనే డెన్నైస్ విన్ అనే మనస్తత్వ శాస్త్రజ్ఞుడు కొరియన్ యుద్ధంలో పట్టుబడిన అమెరికన్ సైనికులని కొరియన్లు ఎలా కమ్యూనిష్టులుగా మార్చిందీ అన్న విషయం మీద పరిశోధనలు చేసి Manipulated Mind అనే పుస్తకంలో మనుషులని మానసికంగా ఎలా లొంగదీసుకొని బానిసలుగా మార్చచ్చో వివరంగా చెప్పేరు. ఇందులో డెన్నైస్ గారు చెప్పినదేంటంటే- మనం మనమనుకొన్నంత స్వతంత్రులం, స్వయం నిర్ణయాధికారం ఉన్నవాళ్ళం కాదు. ప్రతి మనిషి తనలోపల కోరికలకి, సంఘం తనని మెచ్చుకోవాలని, ఎదుటి వాళ్ళు ప్రేమించాలని, గుర్తించాలనీ ఇలా మనకు తెలియకుండానే చాల మానసిక శక్తులకి లొంగిపోయి ఉంటాం. ఈ మానసిక శక్తులే మనల్ని నడిపిస్తూ ఉంటాయి. ఎన్నో రకాల ఒత్తిడులు మనకి కనిపించకుండా, మనకి తెలియకుండా మనమీద అధికారం చెలాయిస్తూ ఉంటాయి. ఇటువంటి ఒత్తిడులని ఉపయోగించి ఎటువంటి మనిషినైనా లొంగదిసుకోవచ్చు. సామాన్యులకి ఒక నాయకుడు కావాలి- రాజకీయ నాయకులు దీనిని ఉపయోగించుకొంటారు. పది మందిని చేర్చి వాళ్ళ జీవితాలు దుర్భరంగా ఉండటానికి కారణం- ఎదుటి పార్టియో, లేక పోతే పొరుగు దేశమో, కాకపోతే ఇంకో మతస్తులో, కులస్తులో- ఎవర్నో చూపించి, వాళ్ళ మీద కోపం రగల చేస్తారు. ఇలాగే కొంత మంది మతాధికారులు, స్వాములూ- మతంతో, మనిషిలో అంతర్లీనంగా ఉండే దైవ భక్తిని, భయాన్ని ఉపయోగించుకొని, మంత్ర తంత్రాలంటూ ఏవో అద్భుతాలు చూపించి, ఆ తర్వాత భజనలు చేయించి భక్తులని లొంగదీసుకొంటారు. ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు ప్రచార సాధనాలతో తమకి కావల్సిన అభిప్రాయాన్ని మనకు కలిగేలా- పదే పదే ఊదరగొట్టి, మన అభిప్రాయాలు మార్చేస్తూ ఉంటారు. ఈ రోజుల్లో టి.వి.లో వచ్చే వ్యాపార ప్రకటనలే దీనికుదాహరణం. మనకి తెలియకుండానే మన మానసిక ఒత్తిడుల మీద పనిచేస్తూంటాయి చాల ప్రకటనలు. ఉదాహరణకి, ఒక ప్రకటనలో- పిల్లాడు భోజనం చెయ్యడానికి అల్లరి చేస్తూ ఉంటాడు- తల్లిని పరుగులెత్తిస్తూ ఉంటాడు. ఇంతలో తల్లి ప్రకటనలో ఉన్న వెన్న కొంటుంది, ఆ తర్వాత పిల్లాడే తల్లి వెనకాల రొట్టి ముక్కకోసం పరిగెడుతూ ఉంటాడు. ప్రతి తల్లి కనే కలనే ఇలా బూతద్దంలో చూపించటమన్న మాట. ఆ తర్వాత ఎపుడో కొట్టుకి పోయినపుడు- ఈ వెన్న (తను కన్న కల) కనిపించగానే సుమారుగా ప్రతి తల్లి కొంటుంది. ఇలాగే అన్యోన్యంగా, ఆనందంగా ఉండే కుటుంబాలని చూపిస్తారు. భార్య మాట వినే భర్తని చూపిస్తారు, భర్త మాటవినే భార్యని

చూపిస్తారు, తెలివైన పిల్లలని చూపిస్తారు. ప్రతి మనిషి ఊహించుకొనే రంగుల కలలివి. అయితే ఏ ప్రకటనలోనూ మా సంస్థ చేసిన వస్తువులే కొనండి అని మాత్రం చెప్పరు. అది మనకి మనం, మనకి తెలియ కుండానే, ఆపాదించుకొంటాం. ఇలా Brain Washing ఉపయోగించి, ఎదుటి మనుషుల చేత ఎలాంటి దుర్ఘటమైన పనులనైనా చేయించొచ్చు. వ్యాపార సంస్థల నుంచి, ఉగ్రవాద సంస్థల వరకూ- అందరూ చాల తెలివిగా, చాల శక్తివంతమైన ఆయుధంగా దీన్ని సామాన్యుల మీద ప్రయోగిస్తున్న వారే.

ఇలాంటి మానసిక ఒత్తిడులకి లొంగకుండా ఉండాలంటే మనిషి ఏం చెయ్యాలి, ఎలా ఉండాలి అన్న విషయాలు కూడ Manipulated Mind లో డెనైస్ విన్ వివరంగా చెప్పరు. సీతాదేవి చేసి చూపించింది. భయం, ఆశ అనే నరక స్వర్గాలకి అతీతంగా గతించిన కాలం యొక్క తలపులు, రాబోయో కాలం తాలుకు ఊహల్లోనూ కాకుండా వర్తమాన పరిస్థితుల కనుగుణంగా ఉండటమే ఎటువంటి ఒత్తిడికైనా విరుగుడు. ప్రవాహంలో కొట్టుకొని పోతున్నవాడికి కావల్సింది- ఒడ్డు కనిపించటం కాదు, ఒక చిన్న తెప్ప. ఒక తెప్ప ఆధారంగా దొరికితే - మునిగి పోతాం అన్న భయం పోతుంది, అంత మాత్రం చేత ఒడ్డుకు చేరిపోతాం అనే ఆశ కూడ ఉండదు. సీత రామనామం అనే తెప్పని ఆధారం చేసికొంది. ఆవిడ, గతించిన కాలం తలుచుకొంటూ విరహవేదన అనుభవించలేదు, రాబోయే కాలాన్ని గురించి ఎటువంటి ఆలోచనలూ చెయ్యలేదు. వర్తమాన పరిస్థితికి దు:ఖించలేదు, ఎవరికీ భయపడలేదు ఎదుటి వాళ్ళ బెదిరింపులని మనం పదే పదే ఆలోచిస్తేనే భయం కలుగుతుంది. సీతకి అటువంటి ఆలోచనలు లేవు- ఆవిడ ఎల్లవేళలా రామనామాన్ని మననం చేసికొనేదే తప్ప- వేరే ఆలోచనలావిడకి లేవు.

ఎవరైనా భయాలకి, ఒత్తుడిలకి లొంగినపుడు- సుందరకాండ చదవ మని చెప్తారు పెద్దలు- బహు:శా, ఇందుకనేనేమో! రామాయణ కథ మనదేశంలో ప్రజలందరికీ కొన్ని వేల సంవత్సరాల నుంచి ఉగ్గుపాలతో పాటు పట్టిస్తారు కాబట్టే, మన దేశంలో ప్రజలని బానిసలుగా, మానసికంగా లొంగదీసుకోవటం అంత సులువైన పనికాదు. అమెరికా వంటి దేశాల్లో, కొంత మంది ``స్వాములు" వాళ్ళ భక్తుల చేత విషం తాగించేరు. మనదేశంలో ఇలాంటి పని సుమారుగా అసంభవమే! అందుకే, రామాయణాన్ని భారతీయ సంస్కృతిని, నాగరకతని కాపాడే పట్టుకొమ్మ అంటారు.

సరే ఇంతకీ చెట్టు మీద మన కథా నాయకుడేం చేస్తున్నాడో చూద్దాం. ఆయన జరిగినదంతా చూసేడు. పరిస్థితి అర్థం అయ్యింది. తను చూసిన స్త్రీ సీతాదేవే అని నిస్సందేహంగా ఋజువు కూడ అయ్యింది. ఆవిడ రావణుడికి లోబడలేదని కూడ స్పష్టం అయ్యింది. కాబట్టి తను వచ్చిన పని అయిపోయినట్టే- గుట్టు రట్టు కాకుండా వెనక్కి పోవచ్చు. కాని, తను చూసిన పరిస్థితులలో సీతని వదలిపెట్టిపోతే, ఆవిడ ఎక్కువకాలం బతకకపోవచ్చు. ఆవిడని కలసి మాట్లాడాలంటే- ముందు ఆవిడ విశ్వాసాన్ని చూరగొనాలి, కావలి కాస్తున్న రాక్షసులకంటబడకుండా పనిచేసుకు పోవాలి. తను ఒక్కసారి బయటపడి రామదూతని చెప్తే ఆవిడ నమ్మకపోవచ్చు- పైగా తనని కూడ రావణుడు పంపించిన రాక్షసుడనుకోవచ్చుకూడ. ఎలాగ ఆవిడతో మాట్లాడడమా అని హనుమంతుడు దీర్ఘంగా ఆలోచించేడు. ఆవిడకి నమ్మదగ్గట్టుగా, ఉత్సాహం ఉత్తేజం కలిగించేటట్టుగా - ముఖ్యంగా, వేసవిఎండకి బీటలు వారిన భూమి మీద తొలకరి వానజల్లులా- ఆవిడ హృదయానికి సేద దీర్చేటట్టుగా, మనోహరంగా ఏదైనా చెప్పాలి. అలాచేస్తే, ముందుగా తనని నమ్మకపోయినా తనుచెప్పేది వినడానికైనా ఆవిడ ఉత్సాహం చూపిస్తుంది. ఆ తర్వాత నెమ్మదిగా ఆవిడకి తనెవరో, ఎందుకు వచ్చిందీ చెప్పుకోవచ్చు. కాని ఏం చెప్పాలి? ఏ భాషలో ఎలా చెప్పాలి? చాల ఆలోచించి హనుమంతుడు సీతకి ఇష్టమైన రామకథనే చెప్పడానికి పూనుకొన్నాడు

ఇక్కడ వాల్మీకి గారు చేసిన చమత్కారాలు చాల ఉన్నాయి. మరే పురాణానికి లేని ఒక ప్రాశస్త్యాన్ని రామాయణానికి కల్పించేరు మహాకవి వాల్మీకి. రామాయణానికి మొదటి శ్రోత రాముడే. లవకుశులు అయోధ్యలో రామాయణం గానం చేయడానికి వెళతారు. వాళ్ళు కథ మొదలు పెట్టగానే, సింహాసనం మీద నుంచి లేచి, జన మధ్యంలో కూచుని కథంతా విన్నాడట రాముడు. రామాయణాన్ని రాముడు వింటున్నట్టుగానే ప్రారంభించేరు వాల్మీకి. రామకథని రాముడికే చెప్పిన వాల్మీకి, అవకాశం వస్తే సీతకి రామకథ చెప్పకుండా వదలి పెడతారా? అదీ కాకుండా, రామాయణం అంటే సీతారాములిద్దరి కథ కదా? సీతని రావణుడపహరించిన తర్వాత, వారి కథలు వేరు వేరుగా నడుస్తున్నాయి- అటు రాముడి కథ కిష్కిందలో స్నేహితుల మద్య నడుస్తోంది, ఇటు సీత కథ లంకలో నడుస్తోంది. వీరిద్దరి కథలని అనుసంధానం చెయ్యడానికి వాక్యవిశారదుడైన హనుమంతుడిని ఎన్నుకొన్నారు వాల్మీకి.

వాల్మీకి ఇక్కడ ఇంకో చమత్కారం కూడ చేసేరు. హనుమంతుడు చెట్టు మీదనుంచి కథలోకి దూకేస్తూ ఉంటాడని చెప్పుకొన్నాం కదా ఇంతకు ముందు. ఈ సారి హనుమంతుడిని చెట్టెక్కించి మరీ కథ చెప్పించేరు- వాల్మీకి అసాధ్యుడు.

హనుమంతుడు సీతకి మనోహరంగా రామకథ చెప్తాడు. ముందు ఆవిడ అనుమానిస్తుంది మెల్లి మెల్లిగా నమ్మకం నమ్మకం కుదురుతుంది. హనుమంతుడు తానెవరో, ఎందుకు వచ్చేడో, రాముడికి, సుగ్రీవుడికి ఎలాస్నేహం అయ్యిందో, మొత్తం భూమికి నలుదిక్కులా వానర వీరులు సీతకోసం ఎలా వెదుకుతున్నారో- ఇలా జరిగిన విషయాలు అన్నీ చెప్పి, రాముడు ఆమె గురించి ఎంతగా తపిస్తున్నాడో, ఆవిడ చెరవిడిపించడానికి ఎటువంటి యుద్ధ ప్రయత్నాలు చేస్తున్నాడో- ఇవన్నీ చెప్పి, ఆవిడలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తాడు.

సీత కూడ హనుమంతునికి బోలెడు కథలు చెప్తుంది. రాముడు తనని ఎంత ప్రేమగా చూసుకొనేవాడో, లక్ష్మణుడు ఎంత భక్తిగా సేవలు చేసేవాడో, ఎవరికీ తెలియని తనకి మాత్రమే తెలిసిన రాముడి గురించి హనుమంతుడికి చెప్తుంది.

వాల్మీకి ఎంత కళ్ళకు కట్టినట్టుగా ఈ సన్నివేశాలని చిత్రించినా మనకి అక్కడ అశోకవనంలో ఏ చెట్టుచాటునో దాంకొని- హనుమంతుడు సీతకి చెప్పిన కథలు, సీత హనుమంతుడికి చెప్పిన ముచ్చట్లూ వినాలనిపించేంత మధుర మైన ఘట్టమిది.

రాముడికి మొదటి పరిచయంలోనే హనుమంతుని మీద విశ్వాసం ఎలాకుదిరిందో, సీతకి మొదటి పరిచయంలోనే హనుమంతునిపై అవ్యాజమైన ప్రేమానురాగాలు కలిగేయి. తన ఆత్మ శక్తినంతా కేంద్రీకరించిన చుడామణిని హనుమంతుడికిచ్చింది.

అంతకు ముందు వరకు వామనుడిలా ఉన్న హనుమంతుడు- సత్సాంగత్యంతో, ఆత్మశక్తితో త్రివిక్రముడిలా ఆకాశం అంత ఎత్తు ఎదిగిపోయేడు. ఆ తర్వాత నుంచి, హనుమంతుడిలో ఆత్మవిశ్వాసం, సంకల్పశక్తి కొండంతగా పెరిగిపోయేయి. ప్రతి పనికి వెనకాముందూ ఆలోచించుకొనే హనుమంతుడు, చూడామణి దొరికిన తర్వాత సంకల్పమాత్రంచేతే కార్యసాధకుడయ్యేడు. చూడామణికి ముందు వానరుడిలా అగుపించే హనుమంతుడు, ఆ తర్వాత ఆత్మజ్ఞానిగా, సిద్ధ పురుషుడిగా, స్థిత ప్రజ్ఞుడిగా కనిపిస్తాడు.

చూడామణిని అందుకొని అమ్మవారి దగ్గర సెలవు తీసుకొన్నాడు. ఆవిడ కూడ అందరి ఆడవాళ్ళలాగే సందేహాల పుట్ట- సముద్రం దాటి వానరులు ఎలా వస్తారు- నువ్వైతే వాయు పుత్రుడివి, అసాధ్యుడివి కనక రాగలిగేవు, కాని ఇది మిగతా వానరులందరికీ సాధ్యమా? అసలింతకాలం వరకు రాముడెందుకు రాలేదు? ఆయన తలచుకొంటే ముల్లోకాలనీ అల్లకల్లోలం చెయ్యగలడు కదా- మరి ఇంతకాలం ఎందుకుపేక్షించినట్టు, పోనీ లక్ష్మణుడైనా ఎందుకు ప్రయత్నం చెయ్యలేదు, నా గురించి తలచుకొంటున్నారా, లేకపోతే మరచిపోయేరా- అంటూ యక్ష ప్రశ్నలన్నీ అడుగుతుంది. అన్నిటికి హనుమంతుడు ఓపికగా, యుక్తిగా సమాధానం చెప్పి ఆవిడకి ధైర్యం చెప్తాడు. ఇన్నాళ్ళు నువ్వెక్కడున్నావో తెలియక, నీకోసం విరహవేదనపడుతూ ఉపేక్షించేడు కాని, ఇంక తొందరలోనే అగ్నిశిఖల్లాటి రామబాణాలు లంక మీద పడటం నువ్వు చూస్తావు అని ధైర్యం చెప్పేడు. వానరులు ఇక్కడకి ఎలా వస్తారని సందేహించనక్కరలేదు. ఇటువంటి కార్యాలకి రాజులు తమ సైన్యంలో అతి సామాన్యులనే పంపిస్తారు- అందువల్ల వానరుల్లో అందరూ నన్ను మించిన వాళ్ళేకాని, నాకంటే తక్కువ వాడు ఒక్కడూ లేడని చెప్తాడు.

ఇలా ఆ విడకి రకరకాలుగా పదే పదే ధైర్యం చెప్పి- సెలవు అడుగుతాడు. అపుడు అమ్మవారు పోనీ- ఒక్కరోజు ఆగి వెళ్ళకూడదా, నాకు ఊరటగా ఉంటుంది కదా అంది. లక్ష్మణుడిని కూడ అన్నగారు లేకుండా తన సమక్షంలో ఒక్క క్షణం కూడ ఉండనియ్యని సీత- హనుమంతుడిని ఆగిపోమన్నడం చిత్రంగానే ఉంటుంది. హనుమంతుడి మీద ఆవిడకింత అనురాగం మరి.

యుద్ధం ఇంకెలాగు తప్పదు కాబట్టి ఈ రాక్షసుల బలాబలాలు తేల్చవలసిందే అనుకొన్నాడు హనుమంతుడు. అశోక వనాన్ని ధ్వంసం చేసేడు, వచ్చిన రాక్షసులందరినీ చితక బాదేడు, రావణుడి సభలో అతనికి హితవులు చెప్పేడు- రావణుడి సేనలో ఎవరెవరున్నదీ, వారి బలా బలాలు అన్నీ అంచనా వేసేడు. దుర్భేద్యమైన లంకానగరం రక్షణ వ్యవస్థనంతటినీ అవకాశం చిక్కినప్పుడే ధ్వంసం చేసేడు- లంకంతటికీ నిప్పంటించి- కోటలు, బురుజులు, కందకాలు, భవనాలు, తోటలు - ఇలా అన్నీ నాశనం చేసేడు. ఇలా గర్వంతో విర్రవీగుతున్న రాక్షసులందరిలోనూ భయాందోళనలు కలుగ చేసేడు - ఒక్క వానరుడే ఇంత నష్టం చేస్తే - ఇంక రామదండంతా వస్తే తిరుగు లేదు- మనకి అపజయం తప్పదు అని రాక్షసులంతా

అనుకొనేటట్టు చేసి, తిరుగు ప్రయాణం పట్టేడు. తీరంలో మిత్రులందరినీ కలసి జరిగినదంతా చెప్పి. అందరితో కలసి, రాముడికి ఏం చెప్పాలో నిర్ణయించి, కిష్కిందకు పోయి, రాముడికి జరిగినదీ, చూసినదంతా పొల్లు పోకుండా సీత వృత్తాంతమంతా వివరంగా చెప్పేడు. ఇదీ సుందర కాండ.

హనుమంతుడు చెప్పిన సీతాన్వేషణ సంగతులన్నీ రాముడు చెవులప్పగించి విన్నాడు. ఆయినకి ఎంతసేపు విన్నా, ఎన్నిసార్లు విన్నా తనివి తీరలేదు. అడిగిందే మళ్ళా మళ్ళా అడుగుతూ, హనుమంతుడు చెప్తుంటే వింటూ ఊరట పడ్డారు.

ఇంత మహత్ క్కార్యం సాధించుకొచ్చిన నీకు ఏమివ్వగలను- నాసర్వస్వమూ ఈ కౌగిలే అంటూ హనుమంతుడిని గుచ్చి కౌగలించుకొన్నాడు. పద్నాలుగు భువనాలనేలే పరమాత్మ చేతే నా దగ్గిరేం లేదని పించి కౌగిలి కొట్టేసిన ఘనత హనుమంతుడొక్కడిదే.

సీతా సమాచారం అంతా తెలిసింది కాబట్టి- రామదండంతా మహోత్సాహంతో, చెలియలికట్ట దాటిన సముద్రంలాగ లంకానగరం పైపు ఉరకలు వేసుకొంటూ పోయింది. దక్షిణ సముద్ర తీరం దగ్గర విడిది చేసేరు.

ఈలోగా అటు లంకలో సీతాపహరణం విషయంలో, యుద్ధం విషయంలో రాక్షసుల మధ్య కొన్ని అభిప్రాయ భేదాలు వచ్చేయి. విభీషణుడిని రావణుడు లంక నుంచి వెళ్ళగొట్టేడు. భార్యా బిడ్డలని వదలి, విభీషణుడు తన మంత్రులతో వానరసేన విడిది చేసిన సముద్రతీరం దగ్గరకు వచ్చి, రాముడి శరణు అడుగుతాడు.

రాముడు అపుడు- సుగ్రీవుడు, లక్ష్మణుడు, అంగదుడు, హనుమంతుడు, జాంబవంతుడూ మొదలైన సేనానాయకులు, మంత్రులందరినీ విభీషణుడికి శరణు ఇచ్చే విషయంలో వాళ్ళ అభిప్రాయాలన్నీ అడుగుతాడు. రావణుడు ఏదో కుటిలోపాయం పన్ని మనని వెన్ను పోటు పొడవడానికే విభీషణుడుని పంపించుంటాడు అని కొందరంటారు. వీడితో మాట్లాడి వీడి గుణగణాలన్ని తెలుసుకొని- మంచివాడైతే చేర్చుకొందాం అంటారు కొందరు. ఎవరైనా గూఢచారిని పంపించి, అసలు విషయమేమిటో తెలుసుకొందాం అంటారు మరికొందరు. జాంబవంతుడు చాలసేపు ఆలోచించి- అన్న తిట్టేడు కాబట్టి వచ్చేను అని వీడు చెప్తుంది నమ్మశక్యంగా లేదు- అందులోనూ ఇటువంటి ఆపత్సమయంలో ఏదో వాదోపవాదాలు

వచ్చేయని అన్నని వదలి ఎవరేనా వచ్చేస్తారా? అదీగాక, ఇపుడు మనదగ్గరకి రావటం కూడ అనుమానంగానే ఉంది అని నీతిశాస్త్రం ప్రకారం తన వాదాన్ని రాముడితో చెప్తాడు. హనుమంతుడు మాత్రం ఈ వాదాలన్నీ ఖండిస్తూ తర్క శాస్త్రంలో షెర్లాక్ హొమ్స్ ని మరపిస్తాడు. హనుమంతుడి తర్కం ఎలా ఉంటుందో చూడండి:

విభీషణుడి గుణ దోషాలను పరీక్షించిన తర్వాత మనలో చేర్చుకోవటమో, మానటమో చేయాలనే వాదంలో ఒక తప్పు కనపడుతున్నది. ఏదైనా ఒక గొప్ప రాజకార్యం నిర్వహిస్తేనే తప్ప ఒకడి గుణ దోషాలు తెలియవు. గుణ దోషాలు తెలిసి ఉంటేనే తప్ప ఒకడిని గొప్ప రాజ కార్యానికి నియోగించరు. అందువల్ల గుణదోషాలు పరీక్షించి చేర్చుకోవటం అనే పద్ధతికి అన్యోన్యాశ్రయ దోషం పట్టింది. గూఢచారిని పంపించి గుణదోషాలను తెలుసుకోవాలన్న వాదం కూడ సమంజసంగా లేదు. ఎక్కడో దూరదేశంలో ఉన్నవాడిని గురించి తెలుసుకోటానికి గూఢచారిని పంపిస్తే వాడు అక్కడకి పోయి సమస్తమూ విచారించి తెలుసుకొని రాగలుగుతాడు. కాని ఎట్ట ఎదుట కనపడుతున్న వాడి దగ్గరకు పోయి ఏమి కనుక్కోగలుగుతాడు?

"విభీషణుడు అకాలంలో అనుచిత ప్రదేశానికి వచ్చేడన్న వాదం కూడ సమంజసంగా లేదు. వీడు తన అన్న పురుషాధముడు అనీ, నీవు పురుషోత్తముడని విమర్శించి తెలుసుకొని ఉంటాడు. రావణుడు సీతని అపహరించడమూ, తాను మంచిమాటలు చెప్పినా వినకపోవటమూ స్వయముగా ఎరుగును. నీవు ఖర దూషణాదులను వధించటమూ, వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టము కట్టడమూ మొదలైన నీ పరాక్రమాదులని తెలుసుకొని ఉంటాడు. సముద్రాన్ని దాటి, లంకను ముట్టడించడానికి నీవు ఇపుడు ఇక్కడికి రావటమున్నూ తెలుసుకొని, అందువల్ల నిన్ను చేరడానికి ఇపుడు ఇక్కడకి వచ్చేడు. కాబట్టి, ఈ విభీషణుడు రావటానికి ఇదే సమయయమూ, సముచిత ప్రదేశమూ కూడ".

సామాన్య మానవుని ఆలోచనా విధానానికి, స్థిరచిత్తుడైన వ్యక్తి యొక్క ఆలోచనా సరళికి చాల వ్యత్యాసం ఉంటుంది. ఈ వ్యత్యాసం అంగదాదుల ఆలోచనలకి, హనుమంతుడి ఆలోచనలలోనూ చాల స్పష్టంగా కనిపిస్తుంది. కర్ర విరక్కుండా, పాము చావకుండా మాట్లాడతారు మిగతా అందరూ. శరణంటూ శత్రువు శిబిరంలోంచి వచ్చిన వాడిని చేర్చుకోవాలా, వద్దా అని రాజు అడిగిన ప్రశ్న. దానికి, వాడు నమ్మకస్తుడైతే చేర్చుకోవచ్చు అనే

సలహా అర్థంలేనిది, రాజుకి ఉపయోగం లేనిది. నమ్మకస్తుడైతే చేర్చుకోవచ్చన్న సంగతి ప్రాజ్ఞుడైన రాజుకి వేరొకరు చెప్పనక్కరలేదు. ఇందులో, ఒకవేళ నేనిచ్చిన సలహా సరియైనది కాకపోతే దాని పరిణామాలకి బాధ్యత వహించటం నాకిష్టంలేదు, కాబట్టి నేను సమాధానం చెప్పను అనే గోడమీద పిల్లి వాటం కనిపిస్తుంది. అలాగే, విభీషణుడు లేక పోతే మనకొచ్చే నష్టం ఏమీలేదు- కాబట్టి, సందేహం ఉంటే చేర్చుకోక పోవటమే మంచిది అన్న సంకుచితమైన ఆలోచనే కనిపిస్తుంది. కాని, హనుమంతుడు చాల ఖచ్చితంగా, సూటిగా రాజు అడిగిన ప్రశ్నకి బాధ్యతాయుతమైన సమాధానం చెప్పేడు- స్థిర చిత్తుడైన వాడి ఆలోచన, మాట, పని అన్నీ స్థిరంగానే ఉంటాయి ఊగిసలాట ఉండదు.

విభీషణుడు శరణు ఇవ్వాలా, వద్దా అనేది నిజంగానే చిక్కు ప్రశ్న. ఇంగిత జ్ఞానమైన సుగ్రీవుడు చాల చక్కగా ఈ ప్రశ్నని లేవనెత్తాడు. సుగ్రీవుడు లేవనెత్తిన సమస్య-" ఈ విభీషణుడు ఎలాటి వాడైనా కానీ, వీడి అన్న రావణుడు ఎలాటి వాడైనా కాని, ఇటువంటి ఆపత్సయమంలో అన్నని విడిచిపెట్టి రావడం ధర్మంకాదు. కాబట్టి వీడిని నమ్మడానికి వీలులేదు- ఇటువంటి వాడికి శరణివ్వడం కూడ ధర్మంకాదు కదా?"

దాశరధి కరుణాసముద్రుడు - అంతేకాకుండా రాజకీయ తంత్రం అంతా బాగా తెలిసిన వాడు. ఎలాంటి చిక్కు సమస్యలనైనా తేలిగ్గా పరిష్కరించగలడు. మన ప్రవృత్తి మనం నమ్మిన ధర్మానికి అనుగుణంగా ఉండాలి కాని, ఎదుటివాడు ధర్మాత్ముడా, కాదా అన్నదాని మీద ఆధారపడి ఉండకూడదు. ఎదుటివాడు ఎటువంటివాడైనా కానీ, శరణంటే రక్షించడమే నేను నమ్మిన ధర్మం. కాబట్టి, రావణుడే వచ్చి శరణు అడిగితే వాడిని కూడ క్షమించి కాపాడతాను.

ఇంక రెండో సమస్య- వీడు మనలో ఉండి మనకు వెన్నుపోటు పొడుస్తాడేమో అనేది. ఇందులో కూడ అర్థంలేదు. మనసైన్యంలో ఎవరూ జీత భత్యాల మీద పని చేయటం లేదు, మనం సైన్యం లోకి ఎవరినీ బలవంతంగా తీసుకోలేదు. అందరూ తమ ప్రభు కార్యం కోసం తమంతట తాముగా వచ్చినవారే. అందరం మన శక్తిని నమ్ముకున్నవారమే అందువల్ల ఎవరూ మనని వెన్నుపోటు పొడవలేరు.

ఇంక ఈ విభీషణుడు నమ్మదగ్గ వాడా కాదా అన్నది మరో సమస్య. ఈ విషయంలో ప్రత్యక్షమూ, లౌకికమూ అయిన ధర్మసూక్షం ఉంది. ఇరుగు పొరుగున ఉండే రాజులు, జ్ఞాతులూ రాజుకు

కష్టకాలం వచ్చినపుడు దెబ్బతీస్తూ ఉంటారు. అందువల్లనే జ్ఞాతులను బుద్ధిమంతులైన రాజులు శత్రువులుగా పరిగణిస్తూ ఉంటారు. ఇపుడు ఈ విభీషణుడు తన జ్ఞాతియైన రావణుడిని దెబ్బతీయడానికి మన దగ్గరకి వచ్చేడు. ఇక పోతే, శత్రుబలాన్ని స్వీకరించే విషయానికొస్తే- మనం రాక్షస వంశీయులం కాదు, వారి దాయాదులం కాము, వారి రాక్షస రాజ్యంతో మనకు నిమిత్తం లేదు. అందువల్ల ఈ విభీషణుడు మనల్ని ద్వేషించడు. రాజ్యకాంక్షతో వచ్చేడు కాబట్టి మనలను వదిలిపెట్టడు. ఈ లోకంలో తోబుట్టువలందరూ భరతుడి లాగను, కొడుకులందరూ నాలాగను, స్నేహితులందరూ సుగ్రీవుడిలాగను ఉండరు కదా.

విభీషుణుడి రాకతో రాముడికొక పెద్ద సమస్య తీరిపోయింది. తనకి లంకలో ఉన్న రాక్షసులతో ఎటువంటి విరోధం లేదు. తన భార్యని చెరవిడిపించుకోవటం కోసం మొత్తం రాక్షస జాతి నంతా నిర్మూలనం చెయ్యడం రాముడికిష్టంలేదు. దండకారుణ్యం తమ రాజ్యంలో ఉన్న ప్రాంతం. అక్కడ మునులందరూ రాక్షసుల భారి నుంచి తమని కాపాడమని అర్థించేరు కాబట్టి రాజుగా అక్కడి దుష్ట శక్తులని నిగ్రహించటం తన కర్తవ్యం. కాని ఎక్కడో లంకలో ఉన్న రాక్షస రాజ్యాన్నంతటినీ అరాజకం చెయ్యడం భావ్యం కాదు. తను వానర సేనంతటితో లంక మీద దండెత్తుతే- మహాయుద్ధం తప్పదు. అందువల్ల మొత్తం రాజవంశం అంతా నిర్మూలనం కాక తప్పదు. యుద్ధం తర్వాత లంకను పరిపాలించేదెవరు? నాయకుడు లేక పోతే, రాక్షసులందరూ చీలిపోతారు, అందువల్ల సంభవించే పరిణామాలు చాల తీవ్రంగా ఉంటాయి. ఒక్క ఆడదాని కోసం ఇంత అరాజకం రాముడు సృష్టించేడన్న నింద తను మోయవలసి ఉంటుంది. ఈ సమస్య విభీషణుడి రాకతో తీరిపోయింది. అదీగాక, విభీషణుడి రాకతో, రాక్షసులలో కూడ కొంతమందికి రావణుడు చేసిన అధర్మకార్యం నచ్చలేదు. విభీషణుడి రాకతో- వ్యక్తిగతమైన రామరావణ యుద్ధం , ధర్మ యుద్ధంగా మారింది. విభీషణుడు వచ్చేక రాముడు ఉత్సాహంతో యుద్ధోన్ముఖుడయ్యేడు. సముద్రుడిని లొంగదీసి సముద్రం మీద సేతువు నిర్మించేడు. వానర సేనంతా లంకచేరి రావణుడి మీద మహా యుద్ధం ప్రకటించేరు. ఈ యుద్ధంలో ఎంతో మంది మహావీరులు మరణించేరు. ధూమ్రాక్షుడు, మహాపార్శ్వుడు, అతికాయుడు, అకంపనుడు, దేవాంతకుడు. నరాంతకుడు- ఇలా ఎంతో మంది రాక్షస వీరులు- వానరుల చేతిలో చచ్చి వీరస్వర్గం అలంకరించేరు. రావణుడి మహాసేనాని ప్రహస్తుడు కూడ నీలుడి చేతిలో ఓడిపోయి

మరణించేడు. లక్షల కొద్ది రాక్షసులు, వానరులు ప్రాణాలు కోల్పోయిరు. రావణాసురుడికి దిక్కుతోచ లేదు- ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రాలు కూడ పనిచెయ్యలేదు. ఇంకో దారి లేక కుంభకర్ణుడిని నిద్రలేపమన్నాడు. ఈ కుంభ కర్ణుడు రెండు వందల ధనస్సుల వెడల్పు, ఆరు వందల ధనస్సుల పొడుగు ఉండేవాడట. వీడు యుద్ధ భూమిలోకి రావడంతోనే- భయపడి చాల మంది వానరులు సముద్రంలో దూకి మరణించేరు. మరి కొంతమంది వానరులు వీడు చేసిన హూంకారానికి చెలరేగిన గాలికి సుముద్రంలో పడి మరణించేరు. వానర వీరులందరూ- అంగదుడు, హనుమంతుడు, నీలుడు, నలుడు, మైంధ ద్వివుదులు, గజుడు, గవాక్షుడు- ఇలా అందరూ వీడితో యుద్ధం చేసేరు- కాని ప్రయోజనం లేక పోయింది. సుగ్రీవుడు కూడ ప్రయత్నించేడు- కాని వీడి ముక్కు, చెవులు మాత్రం కొరక గలిగేడు. అహంకారాన్ని నిర్మూలించడం పరమాత్ముడికి తప్ప వేరొకరికి సాద్యం కాదు కదా? ఆఖరికి రాముడు కాళ్ళు, చేతులు నరికి- అప్పటికీ వీడు శాంతించక పోతే, వీడి నోటి నిండా బాణాలు కూరి- చివరికి పైకి పంపించవలసి వచ్చింది. కుంభకర్ణుడు చచ్చిన తర్వాత రావణుడు ఇంద్రజిత్తుని యుద్దానికి పంపించేడు- ఇంద్రజిత్తు వానరసేనలని చాల చికాకుపరిచేడు. ఆఖరికి విభీషణుడు ఇంటి గుట్టు బయట పెట్టటం వల్ల, లక్ష్మణుడు చేతిలో చచ్చేడు.

కొడుకులు, తోబుట్టువులు, మిత్రులు, బంధువులు, సేనానులు అందరూ యుద్ధంలో మరణించేరు రావణుడు ఒక్కడు మాత్రం మిగిలేడు. మిగిలిన కొద్ది సైన్యాన్ని వెంటబెట్టుకొని, తనే స్వయంగా యుద్దానికి తరలి వచ్చేడు రావణుడు. యుద్దభూమిలోకి వస్తూనే వానర సేనల మీద విరుచుకు పడ్డాడు. అడ్డొచ్చిన వానరసేనలన్నిటినీ చిత్ర వధ చేస్తూ రాముడి వైపు దూసుకు పోతున్న రావణాసురుడిని- నిలు,నిలు, ముందు నన్ను దాటనిదే, నువ్వు అక్కడికి పోలేవు అంటూ హనుమంతుడు అడ్డగించేడు. రావణుడు నవ్వి, నువ్వు నా కుమారుడు అక్షుడిని చంపిన సంగతి నా గుండెల్లో ఇంకా మండుతూనే ఉంది. నిన్ను చంపి నా కసి తీర్చుకోవల్సిందే. కాని ముందర నువ్వే నన్ను కొట్టు- ఒక వానరుడు రావణుడిని కొట్టేడన్న కీర్తి నీకు శాశ్వతంగా దక్కుతుంది అంటూ తన కవచాన్ని తీసి హనుమంతుడికి ఛాతీ చూపించేడు. హనుమంతుడు కొట్టిన దెబ్బకి రావణుడికి దిమ్మ తిరిగింది- పది తలలలోంచి రక్తం కారుకుంటూ కొంత సేపు అవయవాల స్వాధీనం తప్పి మూర్చ పోయాడు. కాస్సేపటికి తేరుకొని, హనుమంతుడిని

మెచ్చుకొన్నాడు. నువ్వు కొట్టు అంటూ హనుమంతుడు ఛాతీ చూపించేడు. రావణుడు లాగి కొట్టిన దెబ్బకి హనుమంతుడు మూర్ఛ పోయేడు. ఇలా హనుమంతుడు మూర్ఛ పోవటం చూసి లక్ష్మణుడు రావణుడితో తలపడ్డాడు. ఇద్దరికీ పోరు భయంకరంగా జరిగింది. రావణుడు ప్రయోగించిన శక్తి లక్ష్మణుడి గుండెల్లో గుచ్చుకొని లక్ష్మణుడు కూడ మూర్ఛ పోయేడు- హనుమంతుడు హిమాలయాలకి పోయి సంజీవిని తీసుకొచ్చి లక్ష్మణుడిని మళ్ళా బతికించేడు. ఆ తర్వాత రామరావణ యుద్దం భయంకరంగా జరిగింది. సర్వ ప్రాణికోటి- ఆకాశంలో దేవతలు, భూమి మీద ఇటు వానరులు, రాక్షసులు- నిశ్చేష్టులై రామ రావణ యుద్ధాన్ని చూడసాగేరు. రావణుడు రథం మీద, రాముడు నేల మీద యుద్దం చెయ్యడం బాగా లేదంటూ, దేవేంద్రుడు తన రధాన్ని, సారధి మాతలితో రాముడికి పంపించేడు. రామ రావణులిద్దరూ మహోత్సాహంతో యుద్ధం చేసేరు. ఇద్దరూ- తమ దగ్గరున్న దివ్యాస్త్రాలతోనే నానావిధాలైన ఆయుధాలని తమ ధనస్సులతోనే సృష్టించుకొంటూ యుద్ధం చేసేరు. చివరికి రాముడు రావణుడి తల నరికేడు. కాని వెంటనే మరొక తల మొలుచుకొచ్చింది. సహజంగానే శాంతికాముకుడు, కరుణాసముద్రుడూ అయిన రఘురాముడికి రావణుడిని చంపటం ఇష్టం లేదు- మొలిచే కొత్త తలలో కొత్త ఆలోచన మొలవక పోతుందా అని ఆయన ఆశ. ప్రహ్లాదుడిని నానా రకాల బాధలు పెడుతూంటే హిరణ్యకశిపుడి మీద కూడ ఆయన ఓపిక పట్టేడు. శిశుపాలుడి తప్పులు కూడ చాల వరకూ క్షమించి ఊరుకొన్నాడు. కాని హిరణ్యకశిపుడూ మారలేదు, శిశుపాలుడూ మారలేదు- రావణుడు కూడ మారలేదు- ముగ్గురూ ఒక్కరే కదూ?

ఇలా రావణాసురుడు నూటొక్క తలల తెగేయి. చివరికి దేవేంద్ర సారధి మాతలి రాముడితో- ఎందుకింకా సందేహం, వీడు బ్రహ్మాస్త్రానికి కాని చావడు. నువ్వు బ్రహ్మాస్త్రాన్ని సంధించ కుండా ఇంకేవో అస్త్రాలు ప్రయోగించి లాభంలేదు, వీడికి ఇంతటితో ఆయుష్షు మూడింది- కాబట్టి ఇంక సందేహించ కుండా బ్రహ్మాస్త్రం సంధించు- అంటూ కర్తవ్యం గుర్తు చేసేడు. బ్రహ్మాస్త్రం గుండెల్లోంచి దూసుకుపోయి రావణుడి ప్రాణాలు తీసింది. దీనితో ఒక మహా ప్రళయం ముగిసింది- నభూతో నభవిష్యతి అనిపించే రామ రావణయుద్ధం పరి సమాప్తి చెందింది.

ఈ యుద్ధంలో ఎంతో మంది- లక్షల కొద్ది, కోట్ల కొద్ది అటు రాక్షసులూ, ఇటు వానరులు హతులయ్యేరు. యుద్ధ భూమి నిండా రక్తం ఏరులై ప్రవహిస్తోంది. ఎంతో మందో కాళ్ళు, చేతులు

తెగి వికలాంగులై హృదయ విదారకంగా రోదిస్తున్నారు. లంక నుంచి యుద్ధ భూమికి వచ్చి, రావణుడి భార్యలు, మిగతా రాక్షస స్త్రీలు- యుద్ధంలో మరణించిన తమ భర్తల కోసం, పిల్లల కోసం, తండ్రులు, తోబుట్టువుల కోసం వెతుక్కొంటూ, వాళ్ళ శవాల మీద పడి అతి దీనంగా విలపిస్తున్నారు. కాకులు, గద్దలు, రాబందులూ అతి ఘోరంగా అరుస్తూ శవాలని పీక్కు తింటూ విందు చేసు కొంటున్నాయి. ఎటు చూసినా చితిమంటలు, గుండెలు పిండి చేసే ఏడుపులు- ఇదంతా చూసిన రాముడికి మనసు ముక్కలై పోయింది. తను ఒక్క ఆడుదాని కోసం, తన భార్య కోసం- ఆవిడ మీద మోహంతో ఇంత మహాయుద్ధం నడిపించేడు- ఎంతో మంది స్త్రీలు విధవలవ్వడానికి కారణం అయ్యేడు- ఎన్నో లక్షల మంది ప్రాణాలు తీసేడు, ఎంతో మందిని అవిటివాళ్ళని చేసేడు. ప్రపంచంలో గొప్ప వెలుగు వెలిగిన రాక్షస నాగరికతనంతా మళ్ళా తలెత్తుకోలేనంతగా దెబ్బతీసేడు. ఇంత నష్టానికి బాధ్యత తనదే. రావణుడి మోహం ఎంత చెడ్డదో, తన మోహం అంత కన్నా చెడ్డది. తను చేసిన నేరం క్షమించరానిది- నిష్కృతి లేనిది. రాముడికి తనమీద తనకే కోపం కట్టలు తెంచుకొంది.

యుద్ధం- ఎంత గొప్ప కారణం కోసమైన సరే- క్షమించరానిది. నిష్ప్రయోజనమైనది. యుద్ధంలో గెలుపు ఎప్పుడూ ఏక పక్షంగా యముడిదే. అన్ని మహా కావ్యాల్లోనూ, అన్ని మహా యుద్ధాలలోనూ, అందరు మహా వీరుల్లోనూ చివరికి కనిపించేది యుద్ధం పట్ల విముఖతే. ఏ మహాకవి యుద్ధాన్ని క్షమించడు.

రామ రావణ యుద్ధం తర్వాత రాముడూ, మహా భారత యుద్ధం ముందు కృష్ణార్జునులూ, కళింగ యుద్ధం తర్వాత అశోకుడూ యుద్ధానికి, యుద్ధ పరిణామాలని చూసి- మనసు విరిగి సర్వసంగ పరిత్యాగానికి సిద్ధ పడ్డ వాళ్ళే. మహాభారతయుద్ధం ముగిసిన తర్వాత, స్త్రీ పర్వంలో గాంధారి శాపనార్థాలు పెడుతూ ఉంటే శ్రీ కృష్ణుడంతటివాడు కూడ మౌనంగా ఉండిపోయేడు. మహాభారత పర్వాలన్నిటిలోకి స్త్రీపర్వమే అన్నిటి కన్నా ఎత్తైనిది- స్త్రీ పర్వం తర్వాతి పర్వాలన్నీ పల్లాలే. యుద్ధం ముగియగానే మిగిలేది ఉన్మాదమే- ఆ ఉన్మాదాన్ని అనుభవించి, శాంతిని ఆవిష్కరింప చెయ్యడం ఎంత మహా కవికైనా కష్టసాధ్యమైనదే. వ్యాసుల వారికి శాంతి పర్వానికి రావడానికి మధ్యలో ఒక పర్వం పట్టింది.

కాని వాల్మీకి అసాధ్యుడు- ఆయన మనందరి హృదయాలు బయటకు తీసి, వాటిని పిండి వదిలి పెడతాడు. మహా భారతంలో స్త్రీ పర్వం, శాంతి పర్వం అందరికీ గుర్తుండక పోవచ్చు. కాని సీతాదేవి అగ్ని ప్రవేశం మట్టుకూ- ఇప్పటికీ ప్రతి మానవుని హృదయాన్ని సమాధానం దొరకని ప్రశ్నలా దహిస్తూనే ఉంటుంది, యుద్ధ పరిణామాల గురించి ఆలోచింప చేస్తూనే ఉంది.

ఎదురుకుండా వస్తున్న సీతని చూసేటప్పటికి- రాముడి కోపం ఆవిడ మీదకు గిర్రున తిరిగింది. ఆవిడ తన వైపు వేస్తున్న ప్రతి అడుగూ- జ్ఞాపకాలని రేకెత్తించింది. వనవాసానికి ముందు- అడవులకి రావద్దని, అయోధ్యలోనే ఉండి తన తల్లితండ్రులని చూడమని ఎంతగానో తను చెప్పి చూసేడు- కాని ఈవిడ వినలేదు- నేను కలనైన, ఇలనైన, అయోధ్యైనా, అడవైన- నీతోనే ఉంటానంటూ వెంటబడింది. అప్పుడే తన మాట వినుంటే ఇంత అనర్థం, తనకింత అపకీర్తి వచ్చేవి కాదు. పోని వచ్చినందుకు తిన్నగా ఉంది- అడవిలో జింక కావాలంది, తనకి కాపలాగా ఉంచిన తన తమ్ముడు లక్ష్మణుడిని తరిమేసింది. లక్ష్మణుడే అక్కడుంటే- ఇవాళ ఇంత ఘోరం జరగక పోవును కదా. ఆవిడ చేత అన్ని మాటలు పడ్డ తన తమ్ముడు యుద్ధంలో సుమారుగా చచ్చి బతికేడు. పోనీ, ఏదో అయ్యిందనుకొన్నా- హనుమంతుడు తనతో రమ్మనపుడు వచ్చుంటే- ఇంత యుద్ధం అనివార్యమవకపోవును కదా- రావణుడొక్కడికి హతమార్చడానికి తను లంకకు రావలిసిన పనిలేదు కదా! ఇదంతా ఈవిడ తనంతట తను తీసుకొన్న నిర్ణయాలన్నీ అనర్థం తెచ్చి పెట్టేయి- తనని అపకీర్తి పాలుచేసేయి.

దగ్గరకొచ్చిన సీతని దూరంగా పొమ్మన్నాడు. ఇంక నీకు నాకు సరి- దిక్కున్న చోటుకి పొమ్మన్నాడు. ఆవిడేం మామూలు ఆడది కాదు కదా? త్యాగరాజ స్వామివారన్నట్టు- శక్తి స్వరూపిణి, రావణుడిని గెలిచేడన్న కీర్తి మొగుడికి కట్ట బెట్టాలనుకొంది కాని, ఆవిడ కన్నెత్తి చూస్తే వాడెప్పుడో చచ్చుండేవాడు. అలాంటిది, ఈ రోజు పతికి అపకీర్తి వస్తుందంటే- ఆవిడ చూస్తూ ఊరుకుంటుందా? పతికి అవమానం, అపనింద జరిగినపుడు- ఆరోజు దక్షయజ్ఞం సమయంలో శివపత్నీ ఊరుకోలేదు- ఇపుడు రాముడి ప్రియదర్శినీ ఊరుకోలేదు. పేరులో కొత్తగా ఇకారం చేర్చుకొన్నా ఆవిడా, ఈవిడా ఒక్కరే కదా!

కానీ, పరిస్థితులో మాత్రం చిన్నతేడా- అప్పుడు మూర్ఖుడైన తండ్రి మదించి నానా దుర్భాషలాడేడు. కాని ఇపుడు స్వయంగా తన ప్రాణపతే- తనని తనే నిందుచుకోలేని

నిస్సహాయుడై నాటకాలుడుతున్నాడు. ఎంత జగన్నాటక సూత్రధారైతే మాత్రం- ఇంత నాటకమా? నాటకాలు ఈయనొక్కడి సొత్తా, నాకు మాత్రం చేతకాదా అంటూ అమ్మవారు అలిగింది. నాటకం నేనూ నడిపిస్తా చూడంటూ- చితిలో దూకింది.

సీత శీలానికి శంకేందసలు? శీలానికి సత్యాసత్యాలు ఉంటాయేమోగాని, సత్యానికి శీలం ఉండదు కదా? లేనిదానికెందుకూ నిరూపణ. సీత తన శీలాన్ని నిరూపించుకోడానికి అగ్నిలో దూకలేదు- అయ్యవారి మీద పడ్డ అపకీర్తి తన నెత్తికెత్తుకుంది. ఇంతకు ముందొకసారి ఆవిడని దహించడానికి ప్రయత్నించిన అగ్ని దేవుడికి పర్యవసానం ఎలా ఉంటుందో అనుభవం అయ్యింది కదా? ఆవిడ తలలో జేజెమ్మ కాలినా ఊరుకోడు కోదండరాముడు- సముద్రాన్నే ఎండగొట్టటానికి సిద్దపడ్డాడు- ఊరుకుంటాడా- దుంప తెంపుతాడు. అందుకని అగ్నిహోత్రుడు చేతులు దించేసేడు, బ్రహ్మరుద్రాదులందరూ దిగొచ్చేరు, మరణించిన వానరులందరూ లేచొచ్చేరు. ఈరకంగా అయ్యగారి కోరికతీరి ఆయన శాంతించేడు, అమ్మవారి నాటకం నడిచి ఆవిడా శాంతించింది. ఆత్మార్ధం పృద్వీం త్యజేత్ అన్న వేదవాక్యాన్ని వెనక్కి నడిపించి (సీత పృద్వీ పుత్రే కదా)- సత్యం కోసం కూడ యుద్ధం అనవసరమే, శాంతి కోసం సత్యాసైన్నా పరిత్యజించ వలసిందే అంటూ- వాల్మీకి మహర్షి శాంతి స్థాపన చేసేడు. ఇలా మహా భారతంలో రెండు పర్వాలు పట్టిన శాంతి స్థాపన వాల్మీకి రెండు సర్గలలో సాధించేరు. ఆయనకి నమస్కరించి ముందుకి కదులుదాం.

కార్యం సిద్ధించిన తర్వాత క్షణం కూడ నిలవడు కదా కోదండ పాణి? తన మిత్రు లందరికీ సెలవిచ్చి తను సీతాసౌమిత్రులతో అయోధ్యకి వెళ్ళిపోడానికి తొందరపడ్డాడు. తన స్నేహితులందరినీ అయోధ్యరమ్మని తనంతటతానుగా ఆహ్వానించలేదు. ఇందుకో మహత్తరమైన కారణం ఉంది. పద్నాలుగు సంవత్సరాలు రాజ్యాన్నేలిన భరతుడు అధికారం మరిగి తిరిగి తనకి అప్పగించక పోవచ్చు. అధికారం కోసం, రాజ్యం కోసం అన్నదమ్ములు ఎలా పోట్లాడు కొంటారో స్వయంగా చూసేడు కదా. తనకి రాజ్యకాంక్షలేదు- కాని లక్ష్మణుడూరుకోడు. వనవాసానికెళ్ళమని చెప్పిన తండ్రినే చంపడానికి సిద్ధ పడ్డాడు లక్ష్మణుడు. రాక్షసులని జయించిన వానరసేనంతా వెంటుంటే- చూస్తూ ఊరుకోడు. మరొక యుద్ధం తప్పక పోవచ్చు. అపుడైతే పితృవాక్య పరిపాలనంటూ తను ఎలాగోలా సర్దుకొచ్చేడు- ఇపుడు లక్ష్మణుడిని

ఆపడం- అందులోను సుగ్రీవాదులుండగా- అసంభవం. ఏదో ఒక్కడూ ఉంటే ఎలాగోలా శాంతింప చెయ్యచ్చు.

ఒకవేళ భరతుడు నిజంగానే తన రాకకోసం ఎదురుచూస్తూ ఉండొచ్చు. కాని తను మహా సేనంతటినీ వెంటబెట్టుకు వెళితే- అన్నకి నామీద నమ్మకం లేదా అనుకొని కించపడతాడేమో. యువరాజుగా ఉండవలసిన వాడు- ఒకసారి మనస్పర్థలొస్తే- పరిణామాలు చాల తీవ్రంగా ఉండొచ్చు. ఇలా చాలదూరం ఆలోచించి, తనంత తానుగా మిత్రులెవ్వరినీ ఆహ్వానించలేదు రాముడు. కాని సుగ్రీవుడు. విభీషణుడూ మొదలైన మిత్రులందరూ అయోధ్య వచ్చి సీతారాముల పట్టాభిషేకం కళ్ళారా చూడాలని ముచ్చట పడుతూ- వెంట తీసుకు వెళ్ళమని ప్రార్థించేరు. ఇలా తన మిత్రులందరినీ వెంటబెట్టుకొని- అయోధ్యవైపు మళ్ళేరు సీతారాములు. నేరుగా అయోధ్యకి పోకుండా మధ్యలో భరద్వాజాశ్రమంలో విడిది చేసేడు. హనుమంతుడిని భరతుడి దగ్గరకి పంపించేడు- భరతుడికి జరిగిన విషయాలు చెప్పి, జాగర్తగా అతని హావభావాలు, ముఖ కవళికలు గమనించి. ఒక వేళ భరతుడికి రాజ్యకాంక్ష ఉంటే వెంటనే వచ్చి తనతో చెప్పమని హనుమంతుడిని పురమాయించేడు. ఇలాంటి విషయాల్లో హనుమంతుడిది అందెవేసిన చెయ్యికదా? ఈ లోగా తను కూడా భరద్వాజమహర్షిని ఇటుపక్క తనదేశంలో రాజకీయాలు, స్థితిగతులూ అన్నీ అడిగి తెలుసుకొన్నాడు

హనుమంతుడు భరతుడిని కలవడానికి అయోధ్యవైపు ప్రయాణం అయ్యేడు. రాముడు వనవాసానికెళ్ళినప్పటినుంచి భరతుడు కూడా అయోధ్యలో అడుగు పెట్టలేదు. రాజభోగాలేవీ అనుభవించలేదు. సరయూనది దగ్గర నందిగ్రామంలో పర్ణశాల నిర్మించుకొని, తనుకూడ అన్నగారిలాగే నార చీరలు కట్టుకొని, కటిన నేల మీద పడుకొంటూ, కంద మూలాలు తింటూ బ్రహ్మచర్యం అనుసరిస్తున్నాడు. రాముడి పాదుకలకి పట్టాభిషేకం చేసి భక్తి సామ్రాజ్యం స్థాపించేడు భరతుడు.

ఇవన్నీ తెలుసుకొని రఘురాముడు అయోధ్యకి చేరుకొన్నాడు. సీతారామ పట్టాభిషేకం రంగరంగవైభవంగా జరిగింది. శ్రీరామపట్టాభిషేక సమయంలో అందరికీ విందులు చేస్తున్నారు. వానరులందరి కోసం ప్రత్యేకంగా ఒక పందిరి వేసి, వాళ్ళందరికీ స్వయంగా సీతమ్మవారే వడ్డిస్తోంది. భోజనాల సమయంలో, సహజంగా అందరూ తమతమ గొప్పలు చెప్పుకుంటూ

ఉంటారు కదా- వానరులు కూడ ముందు నీకంటే నేనెక్కువ తినగలనంటే- నీకంటే నేనింకా ఎక్కువ తినగలనంటూ వాదించుకోవటం మొదలు పెట్టేరు. ఈ వాదాలు కాస్తా ప్రతాపాలు చూపించుకోటందాకా వెళ్ళింది. నీకంటే నేనేక్కువ దూరం ఎగర గలనంటే, అంతకంటే ఇంకా ఎక్కువ దూరం ఎగరగలనంటూ ఇంకొకడు- నేనంతకంటే ఎక్కువని మరొకడు, కావాలంటే చూడు అంటూ ఆకాశంలోకి ఎగురుతూ మరొకడూ- ఇలా పందిరంతా పీకుతూ, ఎగరటం మొదలెట్టేరు వానరులందరు. సీతమ్మవారు వచ్చే నవ్వు ఆపుకొంటూ, ఒక మూల కూచుని ఉన్న హనుమంతుని దగ్గరకు పోయి- ఏమయ్యా మరి నీ బలం ఏ పాటిదో చూపించు మరి అందిట. దానికి హనుమంతుడు- పని అయిపోయిన తర్వాత ఎందుకమ్మా ప్రతాపం అన్నాడట. ఇక్కడ నుంచి వచ్చినదే హనుమంతుని ముందు కుప్పిగంతులు అన్న సామెత.

పట్టాభిషేకం తర్వాత- రామరాజ్యాన్ని స్థాపించేడు శ్రీరామచంద్రుడు. పదకొండు వేల సంవత్సరాలు భూమిని పాలించి అవతారం చాలించేడు. కాలానుగుణ్యంగా, అవతారాలెత్తడం ఆయనకి తప్పదు కాని- సాధన మట్టుకు ఎప్పుడైనా ఒక్కటే కదా- అందువల్ల హనుమంతుడెప్పుడూ చిరంజీవి. ఎక్కడ, ఎవరు రామనామం జపించినా ఆత్మశక్తి, కార్య సాధనకై ప్రోత్సహంచే ఉత్సాహ శక్తి, అందరికీ సేవ చేసే అనురక్తి, మూర్తీభవించిన భక్తి హనుమంతుడు. ఈయన కథ రామాయణంతో అయిపోలేదు- మహాభారతం లో కూడ ఉంది.

అరణ్యపర్వంలో సౌగంధికా పుష్పాన్ని వెదుక్కొంటూ భీమసేనుడు హిమాలయ పర్వత ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటాడు. భీముడు చేసిన కోలాహలానికి కొండల్లో, అడవుల్లో ఉన్న జంతువులన్నీ హడలెత్తి భయంకరంగా అరుస్తూ పరుగులిడుతున్నాయి. గంధమాధనం మీద తపస్సు చేసుకొంటున్న హనుమంతుడికి ఈ కోలాహలం వినిపించింది. తమ్ముడితో కొంచెం పరాచికాలాడాని సంకల్పించేడు. భీముడిని చాలసేపు ఆట పట్టించేడు. కాస్సేపటికి భీముడికి ఎదురుకుండా ఉన్న ముసలి కోతి హనుమంతుడే అని అర్థం అయ్యింది. స్తోత్రం చేసి త్రేతాయుగం నాటి నిజరూపం చూపించమని ప్రార్థించేడు. దానికి హనుమంతుడు- నాయనా, కాలం ఒక్కవిధంగా ఉండదు గదా, ఆకాలంలో రూపం ఈ కాలంలో చూపించడం ఎలాగవుతుంది అంటాడు. అపుడు భీముడు యుగలక్షణాల గురించి హనుమంతుడిని అడుగుతాడు. మహాభారతంలో అడిగిందే తడవుగా ధర్మాలు బోధించే మహర్షులు మనకి చాలమందే

కనిపిస్తారు. కాని వాళ్ళందరిలా హనుమంతుడు ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడు. చాల సులువుగా, నాలుగు మాటల్లో సూక్ష్మం- అరటి పండు ఒలొచినట్టు చెప్తాడు. నన్నయ్య భట్టారకులవారు హనుమంతుడు చెప్పిన యుగలక్షణాలని చురకత్తులాంటి నాలుగు పద్యాలలోకి ఎక్కించేరు:

"కృతమెకాని కర్తవ్యంబు గృతయుగంబు నందులేదు చతుష్పాద మగుచు ధర్మ
మనఘా వర్తిల్లు నచ్యుతుండయ్యుగమున శుక్లవర్ణుండై ప్రజలగాచుచు వెలుంగు."
" .... మరియుఁ ద్రేతాయుగంబునందుఁ ద్రిపాదంబై ధర్మవు వర్తిల్లు నందు జనులు
నిత్య సత్య ప్రవర్తునలై యజ్ఞతపో దానాదిక్రియల వర్తింతు రందు రక్త వర్ణుండయి
విష్ణు భట్టారకుండు ప్రజారక్షణము జేయు"
"ద్వాపరంబున రెండు పాదములఁ జేసి నడుచు ధర్మువు వేదములో నాల్గు దెరగుపై
ప్రవర్తిల్లు వేద శాస్త్రార్ధచోదితంబులై సర్వ కర్మముల్ ధరణి బరఁగు."
"సత్య పరిహీణులగుదురు జనులు గామ, కాములై చేయుదురు బహు క్రుతువు లోలి
నందుఁద్రైలోక్య వందితుండయ్యతుండు కృష్ణవర్ణుడై జగము రక్షించు మఱియు"
"కలియుగమునందు ధర్మము బలమఱి వర్తిల్లు నేక పాదంబున నందలఘుడు
కృష్ణుడు జగతీ వలయము రక్షించు బీత వర్ణుండగుచున్"
"...అందు జేసిన తపోదానాది కర్మంబులు స్వల్పంబులయ్యును బహుఫలంబులగును..."

ఇలా ధర్మం నాలుగు పాదాలతోనూ, ఒంటిపాదంతోనూ వర్ధిల్లడంలాంటి ప్రయోగాలు హనుమంతుడివే. ఆ తర్వాత భీముడికి సౌగంధికా పుష్పాలు ఎక్కడ దొరుకుతాయో, యక్షులతో ఎలా నడచుకోవాలో మొదలైన జాగర్తలు, వెతకటంలో చిట్కాలు చెప్తాడు. తర్వాత అర్జునుడి రధానికి ధ్వజంగా ఉంటూ మహాభారత యుద్ధాన్ని నడిపిస్తానని వరం ఇస్తాడు. మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు విజయసారధిగా ఉన్నాడే తప్పించి తానుగా యుద్ధం చెయ్యలేదు కదా. ఆయన సారధిగా ఉన్న తన కుడిభుజం హనుమంతుడిని విజయధ్వజంగా తనకెదురుగా ఉంచుకొనే యుద్ధంలోకి దిగేడు. రామాయణంలో ప్రత్యక్షంగా యుద్ధాన్ని నడిపిన రామాంజనేయులిద్దరూ, మహాభారతయుద్ధంలో కృష్ణాంజనేయులుగా, సాక్షులుగా యుద్ధం నడిపించేరు.

శ్రీకృష్ణుడి కాలంలో జరిగిన హనుమంతుని గురించిన ఒక చిత్రమైన కథ ప్రచారంలో ఉంది. ఒకసారి సత్యలోకంలో బ్రహ్మదేవుడి కొలువులో- ముల్లోకాలలోనూ గొప్ప సంగీత విద్వాంసుడెవ్వరనే ప్రశ్న తలెత్తింది. పరీక్షలు జరిగేయి. చివరకి నారద తుంబురు లిద్దరూ మిగిలేరు. వీరిద్దరిలో ఎవరు గొప్ప విద్వాంసుడో బ్రహ్మ దేవుడు, సరస్వతీ దేవి కూడ తేల్చలేక పోయేరు. నారద తుంబురుల తారతమ్యాలు తేల్చగలిగిన వాడు శ్రీకృష్ణుడొక్కడే అన్నాడు బ్రహ్మదేవుడు. అపుడు సరస్వతి వారికొక గొప్ప వీణ ఇచ్చి- మీ ఇద్దరిలో ఎవరునెగ్గితే వారికీ వీణని బహుకరించమని శ్రీకృష్ణుడికి దగ్గరకి వీణతో సహ నారద తుంబురులిద్దరినీ పంపించింది. కొంటెవాడు కదా కృష్ణుడు- మీ తారతమ్యాలు తేల్చగలగడం నావల్లకాదు, అది ఒక్క హనుమంతునికే సాద్యం కాబట్టి హనుమంతుడిని ఇక్కడికి పిలిపించండి అన్నాడు.

నారద తుంబురిలిద్దరికీ చాల కోపం వచ్చింది- భజన పాటలు పాడుకొనే ఆకోతివాడా మాలాటి మహ విద్వాంసులని పరీక్షించేది అంటూ కస్సుమన్నాడు. కృష్ణుడు నవ్వి మీరు నాదగ్గకొచ్చేరు. నాకు తెలిసినంతలో ఈ పని అతనివల్లే అవుతుంది. ఇష్టమైతే అతన్ని పిలిపిస్తాను, కాదంటే మీదారిన మీరు పొండి అన్నాడు. ఇంక విధి లేక నారద తుంబురులిద్దరూ ఒప్పుకొన్నారు.

హనుమంతుడు ద్వారకలో శ్రీకృష్ణుని సభాభవనానికి వచ్చేసరికి, అక్కడ మునులు, మహర్షులు అందరూ ఎదురు చూస్తూఉన్నారు. సరస్వతీ దేవి ఇచ్చిన వీణ సభామంటపంలో మద్యన ఒక చంద్రకాంత శిలా వేదిక మీద పెట్టుంది. నారద తుంబురులిద్దరూ ఒకపక్క తమ వాయిద్యాలతో పాడడానికి సిద్ధంగా ఉన్నారు. కొంటెవాడు చిర్నగువుతో సింహాసనం అలంకరించి ఉన్నాడు. హనుమంతుడికి సంగతంతాచెప్పి న్యాయనిర్ణేతగా ఉండమని అడిగేడు శ్రీకృష్ణుడు. ఏదో భజన పాటగాడిని, నాకసలు సంగీతమేం తెలుసు, అందులోను మహ విద్వాంసులని నేనెలా నిర్ణయించగలను, అయినా నువ్వడిగేవు కదా- తప్పదు కదా అంటూ హనుమంతుడు పాటందుకొన్నాడు.

హనుమంతుడి పాటకి ఎదుటనున్న చంద్రకాంతశిల కరిగిపోయింది- వీణ అందులోకి వెళ్ళిపోయింది. హనుమంతుడు పాట ఆపేసరికి మళ్ళా శిల గట్టిపడి, ఆ శిలలోపల ఇరుక్కు పోయింది వీణ. అపుడు హనుమంతుడు- మీ ఇద్దరిలో ఎవరైనా సరే మళ్ళా ఆ శిలను కరిగించి వీణను దక్కించుకోవచ్చు అంటూ తన దారిన తను చక్కా పోయేడు.

నారద తుంబురులిద్దరూ ఎన్నో సంవత్సరాల పాటు ఆ శిలని కరిగించటానికి ప్రయత్నించేరట కాని ఆపని వాళ్ళిద్దరివల్లా కాలేదు. అపుడు హనుమంతుడే ముల్లోకాలలోనూ గొప్ప సంగీత విద్వాంసుడని వారే ఒప్పుకొన్నారు. ఈ రకంగా హనుమంతుని పుణ్యమా అని భజన సంప్రదాయానికి భారతీయ సంగీతంలో ఒక ఉన్నతమైన స్థానం దొరికింది. ఆ తర్వాత ఈ మధ్యనే అపర హనుమంతుడి అవతారమైన త్యాగరాజ స్వామి వారు భజన సంప్రదాయాన్ని తీర్చిదిద్ది, కర్నాటక సంగీతంలో ఒక అత్యున్నత స్థానానికి తీసుకు వచ్చేరు. త్యాగరాజ స్వామి వారికి హనుమంతుడికి ఎన్నో పోలికలు- త్యాగయ్యగారు కూడ ముందు గురువుల దగ్గర కొంత సంగీత విద్య నేర్చుకొన్నారు, ఆస్థిపాస్తులు, కీర్తి ప్రతిష్టలు అన్ని వదులుకొని- సంగీతంలోనే స్వామి దర్శనానికై తపించేరు. అహోరాత్రులు, ఉపవాసాలు చేస్తూ సంగీతసారాన్ని తెలుసుకోవాలని ఎంతో ప్రయత్నం చేసేరు. ఆఖరుకి, ఆ రాముడి దయవల్ల- హనుమంతుడు సముద్రాన్ని లంఘించినట్టు- ఈయన స్వరార్ణవాన్ని ఈది ఆవలి ఒడ్డుకి చేరుకొన్నారు. పంచ రత్నాలలో మహారత్నమైన ఎందరో మహానుభావులు అనే కీర్తనలో ఆయన హనుమంతుడి తత్వన్నంతా మధించి, మనోహరంగా వర్ణంచేరు. మానస వనచరవర సంచారము నిలిపి, మూర్తి బాగుగా పొడగొని, స్వాంతమను సరోజమును సరగున పాదములకు సమర్పణము చేసి, పరాత్పరుని పరమార్ధమగు నిజమార్గముతో బాడుచూ, సల్లాపములో స్వరలయాది రాగముల తెలుసుకొని, తెలివితో, చెలిమితో కరుణకల్గి జగమెల్లను సుధా దృష్టిచే బ్రోచుతూ, హొయలు మీర నడలుగల్గు సరసుని సదా కనుల జూచుచును పులక శరీరులై ఆనంద పయోనిధి నిమగ్నులయి ముదంబున యశము గలవారంటూ ఆయన హరిభక్తులని కీర్తించేరు. ఒక కోతి హనుమంతుడంతటి వాడిలా ఎలా ఎదిగిందన్న ప్రశ్నకి సమాధానం మనకి ఈ కీర్తనలో దొరుకుతుంది.

వానరడిగా హనుమంతుడు పుణికి పుచ్చుకొన్న లక్షణాలు- ఎల్లప్పుడూ సంతోషంగా ఉండటమూ, స్నేహితుల కోసం తాపత్రయ పడటము, తనకంటూ ప్రత్యేకమైన కోరికలు లేక పోవటమూను. వీటిని ఆధారంగా చేసుకొని హనుమంతుడు భగవంతుడు ప్రీతి పాత్రుడయ్యేడు. అలాగే తండ్రి నుంచి ఈయన అందుకొన్న వారసత్వం- భయం లేకుండా ఎక్కడికైనా చొచ్చుకొని పోయే స్వభావం, అందరికీ ప్రాణవాయువు నందించే సేవా తత్పరత. వీటి సాయంతో

కార్యసాధకుడయ్యేడు. మిగిలినదంతా సాధన, ఆపైన కృప. ఈయనలో కోతి గుణాలు లేవని కాదు- ఎప్పుడో తనకి నచ్చిన పండో ఫలమో దొరికినపుడు- ఆనందంతో గెంతులేస్తాడు, ఎగిరి కిందకి దూకి రంకెలు పెడతాడు, తోక ముద్దు పెట్టుకొని కోతి చేష్టలు చేస్తాడు. కాని అదంతవరకే పరిమితం. రాముడు తప్పకుండా లంకకొచ్చి రావణుడిని సంహరిస్తాడు, నామాట నమ్ము అంటూ సీతాదేవికి నచ్చచెప్తూ హనుమంతుడు- నా మాట నిజం, వింధ్య పర్వతాల మీద, మేరు పర్వతాల మీద, మంధర పర్వతం మీద దొరికే రుచికరమైన కందమూల ఫలాల మీద ఒట్టు అని చెప్తూంటే- ఈయన అమాయకత్వానికి మనకి నవ్వొస్తుంది. ఆయన కోతి స్వభావం అంతవరకే. మనందరకీ అందుబాటులో ఉంటూనే, హిమాలయాలకన్నా ఎత్తైనవాడు హనుమంతుడు. ముందే చెప్పినట్టుగా ఈయన భవిష్యద్విధాత.

ఈయన సృష్టించబోయే ప్రపంచం ఎలా ఉంటుందో? ఇప్పట్లా- కోపం, కాలుష్యం, కుళ్ళు కాకుండా- స్నేహం, శాంతి, సంగీతమనే ముడి పదార్థాలతో తప్పకుండా రామరాజ్యం కంటే గొప్పదైన భక్తి సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు.

కృష్ణ శాస్త్రి గారి మాటల్లో- ఈ హనుమంతుడి సామ్రాజ్య-

"ద్వారానికి తారామణి హారం, హారతి వెన్నెల కర్పూరం
మోసం ద్వేషం లేని ఆ సీమలో మొగతాల నిలెచెనీ మందారం"

ఇప్పుడు కాకుండా అప్పుడు పుట్టుంటే ఎంత బాగుండును?!

-భరద్వాజ
30-01-2005